రొయ్యకు ట్రంప్ గండం



- అమెరికాకు ఆక్వా ఎగుమతుల్లో గోదావరి జిల్లాలే టాప్
- 25 శాతం టారిఫ్‌తో ఆక్వా రైతుపై ఎఫెక్ట్
- తగ్గుముఖం పట్టిన రొయ్య ధరలు

స్టాక్ మార్కెట్ కుదేలు

మదుపుదారుల్లో ఆందోళన

7

వేళకు రారాయె !

ప్రభుత్వ కార్యాలయాల్లో లోపించిన పర్యవేక్షణ

'ఆంధ్రజ్యోతి' విజిట్‌లో బయటపడిన అలక్ష్యం

మునిసిపల్, రెవెన్యూ, పంచాయతీరాజ్ ప్రభుత్వ శాఖ ఏదైనా అధికారులు, సిబ్బంది సమయానికి విధులకు హాజరు కావడం లేదు. చాలా మంది అధికారులు ఉదయం 10 గంటలకు విధులకు హాజరైతే చాలా త్వరగా వచ్చినట్లు లెక్క.. కొందరు 11.30 గంటలు, 12 గంటలకు రావడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. వారిపై పర్యవేక్షణ ఎవరిది..? అధికారులే ఆలస్యంగా వస్తే సిబ్బంది కూడా అదే దారిలో నడుస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయం, గ్రామ సచివాలయాలు, విద్యా శాఖ ఉద్యోగులు కార్యాలయాలకు రావడం ఆలస్యం కావడంతో సీట్లు ఖాళీగా దర్శమిస్తున్నాయి. అతి తక్కువ మంది సిబ్బంది మాత్రమే కచ్చితమైన సమయానికి విధులకు హాజరవుతున్నారు. జిల్లాలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో గురువారం ఉద్యోగులు విధులకు హాజరైన సమయాలపై ఆంధ్రజ్యోతి పరిశీలన..

6



అధికారులు, సిబ్బంది లేని తాడేపల్లిగూడెం మునిసిపల్ రెవెన్యూ కార్యాలయం



సమావేశంలో డైరెక్టర్ వెంకటేశ్వరరావు

మహిళా వ్యాపారులను గుర్తించండి

భీమవరం టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘ సభ్యులలో కొత్తగా వ్యాపారం చేయడానికి ఆసక్తి ఉన్న మహిళలను గుర్తించి శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చెయ్యాలని మెప్మా అడిషనల్ మిషన్ డైరెక్టర్ కెఎన్ వెంకటేశ్వరరావు ఆదేశించారు. భీమవరంలో గురువారం మెప్మా జిల్లా అధికారులు సిబ్బందితో సమీక్షించారు. ఇప్పటికే సభ్యులు చేస్తున్న వ్యాపారాలు గుర్తించి వాటిని అభివృద్ధిని చేయించడంతోపాటు సభ్యుల తలసరి ఆదాయం పెంచే విధంగా తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా పీడీ ఎ. హెప్సీబా, సాంకేతిక నిపుణుడు నానిబాబు, శ్రీనివాస్, పార్వతి, మోహనరావు, మునిసిపాల్టీల సిటీ మిషన్ మేనేజర్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

రుణాలు ఇవ్వండి



మహిళా సంఘాలకు బ్యాంకుల మొండిచేయి

స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం అమలు చేస్తున్న రుణ ప్రణాళికపై బ్యాంకులు మొండిచేయి చూపుతున్నాయి. రుణాల మంజూరులో అలసత్వం వహిస్తున్నాయి. ప్రభుత్వం కోరినవిధంగా రుణాలు ఇవ్వడానికి ససేమిరా అంటున్నాయి. గతంలో మాదిరిగానే సంఘం మొత్తానికి రుణం ఇవ్వడానికే ఆసక్తి చూపుతున్నాయి. ఫలితంగా రుణాలు మంజూరు నత్తనడకగా సాగుతోంది.

- క్రెడిట్ ప్లాన్‌కు గండి
- గ్రూపు మొత్తానికి ఇస్తామంటూ మెలిక
- అందరికీ సమానంగా ఇవ్వడానికి మొగ్గు
- ఈ ఏడాది ప్రణాళిక మార్చిన ప్రభుత్వం
- కావాలనుకున్న వారికే రుణం
- సర్వే చేసిన అధికారులు
- బ్యాంకులకు అందిన వివరాలు
- అయినా రుణాలు ఇవ్వకుండా తాత్సారం

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో స్వయం సహాయక సంఘాలకు ఇప్పటి వరకు కేవలం రూ.144.85 కోట్లు రుణం మాత్రమే బ్యాంకులు మంజూరు చేశాయి. వాస్తవానికి జిల్లాలో సర్వే పూర్తిచేసిన స్వయం సహాయక సంఘాలకు రూ.978 కోట్లు అవసరం కానుందని ప్రభుత్వం గుర్తించింది. సంఘాల వివరాలను జిల్లా అధికారులు బ్యాంకులకు సమర్పించారు. అయినా రుణాల మంజూరులో తాత్సారం చేస్తున్నాయి. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతంలోని స్వయం సహాయక సంఘాలకు ఈ ఏడాది కొత్త తరహాలో రుణ ప్రణాళికను సిద్ధం చేసింది. ఒక గ్రూపులో పది మంది సభ్యులుంటున్నారు. గ్రూపులో రుణం అవసరం లేని వారికి ఇవ్వడం లేదు. మరోవైపు రూ.20వేలు కావలన్న మహిళలు ఒక గ్రూపులో ఉంటున్నారు. అదే విధంగా రూ.2 లక్షలు మంజూరు చేయాలని కోరిన సభ్యులు అదే గ్రూపులో ఉండడం గమనార్హం. క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించి అన్ని గ్రూపుల మహిళల రుణ అవసరాన్ని గుర్తించారు. ఈ ఏడాదికి రుణం వద్దనుకుంటే ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయలేదు. కానీ సభ్యులంతా అదే గ్రూపులో ఉంటారు. ఈ విధానంపై మహిళలు ఆసక్తి చూపించారు. కానీ రుణాలు ఇవ్వడానికి బ్యాంకులే మొండికేస్తున్నాయి. గతంలో మాదిరి గ్రూపు మొత్తానికి రుణం ఇచ్చామంటూ చెప్పుకొస్తున్నాయి. అందరికీ సమానంగా రుణం పంచుకునేలా మంజూరు చేస్తామంటూ మెలిక పెడుతున్నాయి. అదే ఇప్పుడు రుణాల మంజూరులో జాప్యం జరుగుతోంది.

లెక్కకు మిక్కిలి రుణం

ఎన్నికల ముందు జిల్లాలో బ్యాంకులు ఇష్టానుసారంగా రుణాలు మంజూరు చేశాయి. రూ.3 వేల

మిగతా 8వ పేజీలో..



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు

కొల్లేరును పరిరక్షించుకుందాం

రఘురామ, కామినేని, ధర్మరాజు

ఉంగుటూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కొల్లేరు జిరాయితీ భూముల రైతులు పర్యావరణానికి ఆటంకం కలుగకుండా సంప్రదాయ వ్యవసాయం చేసుకోవాలని శాసనసభ ఉప సభాపతి రఘురామకృష్ణంరాజు, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు కోరారు. పక్షులతో పాటు మానవులు బతకడానికి మానవతా కోణంలో కొల్లేరును కాపాడుకుందామన్నారు. కొల్లేరు జిరాయితీ భూముల రైతులతో ఉంగుటూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం సమావేశమయ్యారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. ఇటీవల పర్యటించిన కేంద్ర సాధికారిక కమిటీ ఇవ్వనున్న నివేదిక రైతులకు అనుకూలంగా ఉండవచ్చన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని 13 వేల ఎకరాల్లో జిరాయితీ భూములు ఉన్నాయన్నారు. ఈ భూముల్లో సాగు అనేది అధిక శాతం ప్రజలు బడుగు, బలహీనవర్గాల ప్రజల జీవనాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్నారు. పర్యావరణం దెబ్బతినకుండా కొల్లేరును కాపాడాలని, సంప్రదాయ వ్యవసాయం చేయాలని సూచించారు. ఉండి, ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు, కైకలూరు నియోజకవర్గాల ప్రజల కోసం ఆయా ప్రజా ప్రతినిధులు కృషి చేయడంతో పాటు సీఎం, డిప్యూటీ సీఎంల దృష్టికి తీసుకువెళతామని తద్వారా రైతులకు న్యాయం జరుగుతుందని ఆర్ఆర్ఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

పదోన్నతుల్లో పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు అన్యాయం

డీవైఈవో, ఎంఈవో-1 నియామకాలకు డిమాండ్

6

నేడు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

భీమవరం టౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఉదయం 6.30 గంటల నుంచి పింఛన్ల సొమ్ము పంపిణీ చేయనున్నారు. దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, అనారోగ్యంతో మంచాన ఉన్న బాధితులు, చేనేత, అభయ హస్తం తదితర పింఛన్లు అందించనున్నారు. జిల్లాలో 2,26,995 మందికి రూ.9,77,45,075 కోట్లు అందించనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతీ నెల 1న పింఛన్లు ఇస్తున్నారు. పెన్షన్ల పంపిణీని కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా అధికారులు, ప్రత్యేక అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

స్పౌజ్ పెన్షన్‌ల పంపిణీ నేడే

పెన్షన్ పొందుతూ మరణించిన లబ్ధిదారు భార్యకు పెన్షన్ ఇచ్చేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. జిల్లాలో 3,988 మంది అర్హులను గుర్తించినట్లు అధికారులు ప్రకటించారు. వారికి రూ.4వేల చొప్పున శుక్రవారం పింఛన్లు అందిస్తారు. పలుచోట్ల ప్రజా ప్రతినిదుల చేతుల మీదుగా పెన్షన్ అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. భీమవరంలో ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు మునిసిపల్ కార్యాలయంలో ఉదయం 9.30 గంటలకు పింఛన్లు పంపిణీ చెయ్యనున్నారు.

కుమ్ములాట

ఆకివీడు మునిసిపాలిటీ అధికార పక్ష (వైసీపీ) సభ్యుల కుమ్ములాటతో మాటల యుద్ధం జరిగింది. అధికారులు కనీస జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని వైస్ చైర్మన్ విరుచుకుపడితే.. మైక్ ఇచ్చాం కదా అని ఇష్టానుసారం మాట్లాడొద్దు అంటూ చైర్‌పర్సన్ హెచ్చరించారు. అభ్యంతరకరంగా మాట్లాడితే చర్యలు తీసుకుంటామని ఘాటుగా స్పందించారు.

కనీస జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారు : వైస్ చైర్మన్

మైక్ ఇచ్చామని ఇష్టానుసారం మాట్లాడొద్దు : చైర్‌పర్సన్

ఆకివీడు మునిసిపల్ సమావేశంలో వైసీపీ సభ్యుల వాగ్వాదం

ఆకివీడు, జూలై 31(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ సమావేశం గురువారం వాడివేడిగా జరిగింది. డంపింగ్‌యార్డు విషయంలో తనను ఏమైనా అంటే ఊరుకోను, అధికారులు, తదితరులు కనీస జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని వైసీపీ వైస్ చైర్మన్ పుప్పాల పండు విరుచుకుపడ్డారు. చైర్‌పర్సన్ జామి హైమావతి జోక్యం చేసుకుని కౌన్సిల్ సమావేశంలో ఏకవచనంతో ఇష్టానుసారం మాట్లాడితే కుదరదని, మీకేమైనా ఉంటే బయట మాట్లాడుకోవాలన్నారు. చైర్‌పర్సన్‌కు తోడు విప్ పడాల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్ గేదెల అప్పారావు వైస్ చైర్మన్ పండు తీరుపై అభ్యంతరం తెలిపారు. మరోసారి అభ్యంతరకరంగా మాట్లాడితే చర్యలు ఉంటాయని హైమావతి హెచ్చరించారు. గత ప్రభుత్వాల నుంచే సిద్ధాపురం రోడ్డులో డంపింగ్‌యార్డు ఉందని, మన పాలకవర్గం ఏర్పాటు చేయాలేదన్నారు. మైకు ఇస్తున్నాం కదా అని ఇష్టానుసారం మాట్లాడితే కుదరదు, కౌన్సిలర్లు సమస్యలపై మాట్లాడాలని చురకలంటించారు.

నిధుల కేటాయింపులో వివక్ష

నగర పంచాయతీలో 20 వార్డులుంటే వైసీపీకి కౌన్సిలర్ల వార్డులకే లక్షల్లో నిధులు కేటాయిస్తున్నారని టీడీపీ కౌన్సిలర్ బత్తుల శ్యామల ధ్వజమెత్తారు. తమను వార్డు ప్రజలు ఓట్లేసి గెలిపించారని, పన్నులు కట్టించుకుంటున్నాం కదా.. మిగిలిన వార్డులతో సమానంగా నిధులు ఎందుకు కేటాయించరని నిలదీశారు. నగర పంచాయతీ ఏర్పడి నాలు గేళ్లు గడిచినా అభివృద్ధి శూన్యమన్నారు. పంచాయతీగా ఉన్నప్పుడే అభివృద్ధి జరిగేదన్నారు. తాగునీరు, రహదారులు, వీధిలైట్లు, డ్రెయినేజీ, డంపింగ్‌యార్డు తదితర సమస్యలు కోకొల్లలుగా ఉన్నా పాలకవర్గం,

మిగతా 8వ పేజీలో..



మునిసిపల్ సమావేశంలో అధికార వైసీపీ కౌన్సిలర్ల వాగ్వాదం



అభివృద్ధిని అడ్డుకోవడమే వైసీపీ అజెండా



నిరసన తెలుపుతున్న కూటమి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు

యలమంచిలి మండల పరిషత్ సమావేశంలో ప్రతిష్టంభన

కూటమి సభ్యులు హాజరు.. ఎంపీపీ చాంబర్‌లో వైసీపీ సభ్యులు

కోరం లేదని సమావేశం వాయిదా వేసిన ఇన్‌చార్జి ఎంపీడీవో

యలమంచిలి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): యలమంచిలి మండల పరిషత్ సమావేశంలో గురువారం ప్రతిష్టంభన నెలకొంది. సమావేశానికి కూటమి పక్ష సభ్యులు వచ్చినా వైసీపీకి చెందిన ఎంపీపీ, సభ్యులు చాంబర్‌లోనే ఉండి సమావేశం హాలుకు రాలేదు. చివరకు కోరం లేదంటూ ఇన్‌చార్జి ఎంపీడీవో సమావేశం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. దీనితో అభివృద్ధిని అడ్డుకోవడమే వైసీపీ ఎజెండా అంటూ కూటమి పక్ష సభ్యులు నిరసన వ్యక్తం చేశారు.

మండల పరిషత్ సమావేశానికి మధ్యాహ్నం 2గంటలకు కూటమి పక్ష ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు చేరుకున్నారు. కానీ వైసీపీకి చెందిన ఎంపీపీ ఇనుకొండ ధనలక్ష్మి, పలువురు ఎంపీటీసీ సభ్యులు సమావేశ హాలుకు వెళ్లకుండా ఎంపీపీ ఛాంబర్‌లోనే ఉన్నారు. సుమారు 4 గంటల సమయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో జేడీవీ.ప్రసాద్ కోరం లేక సమావేశాన్ని వాయిదా వేసినట్లు ప్రకటించారు. దీనితో కూటమి పక్ష ఎంపీటీసీ సభ్యులు చిలుకూరి రాజ్యలక్ష్మి, కవురు నాగలక్ష్మి, జిల్లెళ్ల రత్నంరాజు, డేగల సత్యసూర్యప్రభ, సర్పంచులు ఈద ప్రమీల, తాళ్ల నాగరాజు, బుడితి జయరాజు, అడబాల చిట్టిబాబు నిరసన తెలిపారు. తమను రెండు గంటలపాటూ కూర్చోబెట్టారని.. కనీసం మంచినీళ్లు కూడా ఇవ్వకుండా అవమానించారన్నారు. సమావేశం జరగకూడదని వైసీపీకి చెందిన ఎంపీపీ, ఎంపీటీసీలు ఛాంబర్‌లో కూర్చున్నారు. అభివృద్ధిని అడ్డుకోవడమే వైసీపీ అజెండా అని విమర్శించారు.

అభివృద్ధి పనుల సమాచారం ఇవ్వడం లేదు

అనంతరం ఎంపీపీ ఇనుకొండ ధనలక్ష్మి విలేకరులతో మాట్లాడుతూ తాను ఎంపీపీగా ఎన్నికైన తర్వాత సుమారు 6 గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు, ప్రారంభోత్సవాలు జరిగాయని, తనకు కనీస సమాచారం ఇవ్వలేదని, ప్రొటోకాల్‌ను పాటించకపోవడం దారుణమన్నారు. ఇన్‌చార్జి ఎంపీపీ అభివృద్ధి పనులకు రూ.78లక్షలు నిధులు కేటాయిస్తూ తీర్మానం చేశారని.. వాటిని గాలికొదిలేశారన్నారు. ప్రొటోకాల్, నిధుల కేటాయింపు తీర్మానాలపై ఎంపీడీవోను అడిగేందుకు వచ్చామని, సమాచారం లేకుండా ఎంపీడీవో సెలవు పెట్టారన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో సమావేశం మాత్రమే నిర్వహిస్తానని చెప్పడంతో తాము హాజరు కాలేదన్నారు. వైస్ ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు, వైసీపీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రహదారులు వేగంగా పూర్తి చేయాలి

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కోరిన మంత్రి శ్రీనివాస వర్మ

7

హాస్టల్‌లో మద్యం, సిగరెట్లు..!

కొరవడిన అధికారుల పర్యవేక్షణ

వేళకు రారాయె !

ప్రభుత్వ కార్యాలయాల్లో సమయ పాలనపై ఆంధ్రజ్యోతి విజిట్



కైకలూరు ఎంఈవో కార్యాలయంలో ఉదయం 11 గంటలైనా హాజరుకాని అధికారి

ప్రభుత్వ కార్యాలయాలు.. 10 గంటల నుంచే అధికారులు, సిబ్బంది హాజరుకావాలి. ప్రజా అవసరాల నిమిత్తం అందుబాటులో ఉండాలి. సెలవుపై ఉంటే సరేసరి. లేకుంటే సమయపాలన పాటించి తీరాల్సిందే. కానీ జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాల్లో చాలా కార్యాలయాల్లో కొందరు గాడితప్పి వ్యవహరిస్తున్నారు. విధులపట్ల అలక్ష్యం వహిస్తున్నారు. సమయపాలన పక్కన పెట్టేశారు. పర్యవేక్షించాల్సిన యంత్రాంగం కంటికి కనిపించదు. గాలివాటంలా కార్యాలయాలు పనిచేస్తున్నాయి. కొన్నిచోట్ల బినామీలే కార్యాలయాల్లో తిష్టవేసి రాజభోగం అనుభవిస్తున్నారు. మరికొన్ని చోట్ల మా ఇష్టం.. మాది అనే ధోరణి. ఇష్టం వచ్చినప్పుడు రావచ్చు...పోవచ్చు. క్యాంపుల పేరిట మరికొందరు గాయబ్. ఆఫీసులు తెరిచే ఉంటాయి గానీ ఖాళీ కుర్చీలు, టేబుళ్లే దర్శనమిస్తాయి. అయ్యగారి కోసం లైట్లు, ఫ్యాన్లు మాత్రం వేసే ఉంచుతారు. ఇంకోవైపు ఉద్యోగమే పరమావధిగా భావించిన వారంతా తక్కున సమయానికి హాజరుకావడం అంతే విజ్ఞతతో రోజూవారీ పనులను చక్కబెట్టడం స్పష్టంగా కనిపించింది. నియోజకవర్గ కేంద్రాల్లో గురువారం ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు ప్రభుత్వ కార్యాలయాలు కొన్నింటిని 'ఆంధ్రజ్యోతి' విజిట్ చేసినప్పుడు ఇవన్నీ బయటపడ్డాయి.
(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ప్రభుత్వ కార్యాలయాల్లో లోపించిన పర్యవేక్షణ
చాలాచోట్ల సమయపాలన పాటిస్తే ఒట్టు
వెక్కిరిస్తున్న ఖాళీ కుర్చీలు, టేబుళ్లు
ఆకస్మిక తనిఖీలేవి.. నిర్లక్ష్యానికి మందేది ?
'ఆంధ్రజ్యోతి' విజిట్‌లో బయటపడిన అలక్ష్యం



నరసాపురం మునిసిపాల్టీలోని రెవెన్యూ విభాగంలో ఉదయం 10.45కు ఖాళీగా ఉన్న కుర్చీలు

మునిసిపల్ కార్యాలయంలో ఖాళీ కుర్చీలు

నరసాపురం టౌన్ (ఆంధ్రజ్యోతి) : నరసాపురం పురపాలన అస్తవ్యస్తంగా మారింది. ప్రతి కౌన్సిల్ సమావేశంలో అధికారుల తీరును కౌన్సిలర్లు ఎండగడుతున్నా ఉద్యోగుల తీరు మాత్రం మారడం లేదు, సమయ పాలన పాటించరన్న వాదనలు వినిపిస్తున్నాయి. 'ఆంధ్రజ్యోతి' గురువారం చేపట్టిన విజిట్‌లో ఈ విషయం మరోసారి బయటపడింది. ఉదయం 10.45 సమయం అయినా చాలా విభాగాల్లో కుర్చీలు ఖాళీగా ఉన్నాయి. రెవెన్యూ సెక్షన్‌లో ఆర్వో మురళీ ఒక్కరే ఛాంబర్‌లో కనిపించారు.ఇక టౌన్ ప్లానింగ్‌లో కూడా ఉద్యోగి మాత్రమే సీటులో ఉన్నారు. కొందరు ఉద్యోగులు బయోమెట్రిక్ వేసి కింద ముచ్చట్లు పెట్టుకోవడం కనిపించింది.



బయోమెట్రిక్ వేసి బయట ముచ్చట్లు



తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి

పాలకొల్లు తహసీల్దార్ కార్యాలయంలో పోస్టులు ఖాళీ

పాలకొల్లు అర్బన్ (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకూ ఆంధ్రజ్యోతి పరిశీలించింది. తహసీల్దార్ దుర్గా కిషోర్ భూముల రీసర్వే నిమిత్తం గ్రామాలకు వెళ్లడంతో తహసీల్దార్ చాంబర్ తెరవలేదు. సూపరిండెంటెంట్, డిప్యూటీ తహసీల్దార్ కూడా తహసీల్దార్‌తో పాటు క్యాంప్‌లో ఉన్నారు. ఆర్ఐ , ఏఎస్‌వో పోస్టు ఖాళీగా ఉన్నాయి. సీఎస్‌డీటీ ఇన్‌చార్జి కావడంతో కార్యాలయానికి రాలేదు. ఇక సీనియర్ అసిస్టెంట్, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్‌లు విధుల్లో ఉన్నారు. ఇద్దరు అటెండర్లకు ఒకరు విధుల్లో ఉండగా మరో పోస్టు ఖాళీ. ముగ్గురు వ్యక్తులు వచ్చి అధికారులు లేకపోవడంతో వెళ్లిపోయారు. పాలకొల్లు మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు సమయపాలన పాటిస్తూ తమ విధులు నిర్వహిస్తున్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఉదయం 10 గంటలకే కార్యాలయానికి వచ్చారు. మిగతా సిబ్బంది కూడా సమయానికి వచ్చారు. మున్సిపాలిటీలో వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులు కూడా సమయానికి వచ్చారు.

ఆచంటలో అంతా సవ్యం

ఆచంట (ఆంధ్రజ్యోతి): ఆచంట తహసీల్దార్ కార్యాలయానికి సంబంధించి గురువారం కింది స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు కూడా ఉదయం 10.30 నుంచి 11 గంటల మధ్యలోనే విధులకు వచ్చారు. ఉదయం 10 గంటలకు ముందే సబార్డినేట్‌లు ఆఫీసు తెరిచారు.



తణుకు మునిసిపల్ కార్యాలయంలో తెరుచుకోని కౌంటర్

తణుకు మునిసిపాలిటీలో బిల్లు కౌంటర్ మూత

తణుకు (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్యాలయం బిల్ కౌంటర్ వద్ద ఉదయం పదిన్నర సమయం అయినా కూడా సంబంధించి సీటు ఖాళీగా దర్శనమిచ్చింది. పన్నులు కట్టేవారు కోసం కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాట్లు ఉంటాయి. అయితే ఇక్కడ మాత్రం అవేమీ కనిపించవు. ఇదే విషయంపై మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్‌ను సంప్రదించగా వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ప్రతి రోజు 8 గంటలకు కౌంటర్ తెరవాలని ఆదేశించారు. బిల్లులు చెల్లించే వారకి ఎలాంటి అసౌకర్యం కలగవద్దని తెలిపారు.



10వ వార్డు సచివాలయంలో సాయంత్రం 4 గంటలకే సీట్లు ఖాళీ..

అంతా ఉద్యోగ విరమణ కార్యక్రమంలో..

తాడేపల్లిగూడెం (ఆంధ్రజ్యోతి) : తాడేపల్లిగూడెం పట్టణంలో 35 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో పనిచేసే ఉద్యోగులు వారి కార్యాలయాల్లో బయోమెట్రిక్ వేసుకుని విధులకు డుమ్మా కొట్టేశారు. సచివాలయ ఉద్యోగుల తీరుపై అసలే తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సచివాలయ ఉద్యోగుల్లో 80 శాతం మంది ఉదయం 11 గంటలకు కార్యాలయాల్లో కనిపించ లేదు. తాడేపల్లిగూడెంలో మున్సిపాల్టీలో మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ సెక్షన్‌లో ఒక్కరు కూడా ఉదయం 11.30 గంటలకు సీట్లో లేరు. విషయమేమిటా అని ఆరా తీస్తే మునిసిపల్ కార్యాలయంలో పనిచేసే ఇద్దరు ఉద్యోగులు గురువారం ఉద్యోగవిరమణ చేశారు. దీంతో కార్యాలయంలో పనిచేసే అధికారులు, సిబ్బంది 80 శాతం వరకు విధులకు డుమ్మా కొట్టేశారు. వీరంతా ఫంక్షన్‌కు హాజరైనట్టు తెలిసింది.

ఏలూరులో అంతా సమయానికే..

ఏలూరుసిటీ (ఆంధ్రజ్యోతి): గురువారం ఉదయం 10.30 గంటల నుంచి 11 గంటల వరకు జిల్లా కేంద్రమైన ఏలూరులోని నాలుగు ప్రభుత్వ కార్యాలయాలను ఆంధ్రజ్యోతి విజిట్ చేసింది. జిల్లా పరిషత్ కార్యాలయం, డీపీవతో , విద్యుత్ , పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయాలను విజిట్ చేయగా సమయానికే ఉద్యోగులు వచ్చారు. సెలవు పెట్టిన ఉద్యోగులు మినహా మిగిలిన వారందరూ సమయానికే హాజరయ్యారు.



ఉంగుటూరు విద్యాశాఖ కార్యాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

పదిన్నర అయినా రాలేదు

ఉంగుటూరు(ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరులో వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో గురువారం ఉదయం పదిన్నర సమయంలో కూడా సంబంధిత ఉద్యోగులు రాలేదు. తహసీల్దార్ కార్యాలయంలో పరిశీలించగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్, విద్యాశాఖ కార్యాలయంలో విద్యాశాఖ అధికారుల కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. సిబ్బందిని ఆరాతీయగా గురువారం మండలంలో ఎమ్మెల్యే పర్యటనలో ఉన్నారన్నారు. ఇన్‌చార్జిగా ఉన్న ఎంఈవో-2 ఎమ్మెల్యే వెంట ఉన్నారని సంబంధిత కార్యాలయ ఉద్యోగిని శ్రీదేవి వివరణ ఇచ్చారు.

కైకలూరులో అందిరిదీ ఒకటే బాట

కైకలూరు (ఆంధ్రజ్యోతి): కైకలూరులో ప్రభుత్వ కార్యాలయాల్లో సమయపాలన పాటించడం లేదు. ఉదయం 11 గంటలైనా మండల కార్యాలయాల్లో విధులకు హాజరు కాలేదు. మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ 11 గంటలు అయినా విధులకు హాజరు కాలేదు. మండల విద్యాశాఖాధికారి 11 గంటలు దాటినా కార్యాలయానికి రాలేదు. కైకలూరు 3వ వార్డు సచివాలయంలో 10 గంటలకు హాజరు కావాల్సి ఉండగా 11 గంటలు దాటినా పంచాయతీ సెక్రటరీ, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్ సిబ్బంది ఎవరూ కూడా విధులకు హాజరుకాలేదు. ఆ సమయంలో వివిధ అవసరాలపై వచ్చిన ప్రజలు సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తిరిగి వెళ్లిపోయారు. ఉదయం 10గంటలు కల్లా ఆయా కార్యాలయాల్లో ఫేస్‌యాప్ ద్వారా ఆన్‌లైన్లో విధులకు హాజరైనట్లు చూపించాల్సి ఉన్నప్పటికీ అధికారులు 11 గంటలు దాటినా హాజరుకాలేదు.

తలుపులు కూడా తీయలేదు



దెందులూరు (ఆంధ్రజ్యోతి) : పర్యవేక్షణ లేకపోవడంతో సచివాలయాల్లో ఉద్యోగులు సమయానికి రావడం లేదు. మండలంలోని పోతునూరు వైద్య ఉప కేంద్రంలో గురువారం ఉదయం 11 గంటల నుంచి 12.45 నిమషాల వరకు కనీసం తలుపులు తీయలేదు. దీనిపై అధికారులను వివరణ కోరగా ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ఫీల్డ్‌కు వెళ్లారని తెలిపారు. అయితే ఆసుపత్రికి వచ్చేవారు ఇబ్బందులు పడకుండా ఒక్కరైనా ఉండే విధంగా చూస్తామని తెలిపారు.

సెలవులో చింతలపూడి తహసీల్దార్



చింతలపూడి (ఆంధ్రజ్యోతి) : గురువారం ఉదయం 11 గంటలకు మండల తహసీల్దార్ కార్యాలయాన్ని విజిట్ చేసింది. రెండు రోజులుగా తహసీల్దార్ ప్రమద్వర సెలవులో ఉన్నారు. ఆమె ఏలూరులో నివాసం ఉంటున్నారు. ఇన్‌చార్జిగా డిప్యూటీ తహసీల్దార్ వ్యవహరిస్తున్నారు. వీఆర్వో, కార్యాలయ సిబ్బంది మాత్రం యధావిధిగా విధులకు హాజరయ్యారు. బయట అర్జీదారులుగాని, పనుల మీద వచ్చిన వారు గాని ఎవరూ లేరు.సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం విజిట్ చేయగా సబ్ రిజిస్ట్రార్ ఇటీ వలే కొత్తగా జాయిన్ అయ్యారు. సిబ్బంది ఉదయం 11 గంటలకు వచ్చారు.

చూడి గేదె కాలికి శస్త్ర చికిత్స

నాలుగు గంటల పాటు ఆపరేషన్
ఖరీదైన పరికరాలు తక్కువ ఖర్చుకే..
పాడి రైతులకు అండగా తణుకు పాలీ క్లినిక్



గేదె కాలికి వైద్యం చేసిన డాక్టర్లు, సిబ్బంది

తణుకు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పశు వైద్యం అందించడంలో తణుకులోని రాష్ట్ర పశు ఆరోగ్య సంస్థ(పాలీ క్లినిక్) ఎంతో ప్రత్యేకత ఉంది. పశువులకు సాధారణ వైద్యంతో పాటు ఎలాంటి శస్త్ర చికిత్సలు చేయాలన్నా జిల్లాలోనే రిఫరల్ ఆసుపత్రిగా పేరు పొందింది. రెండు రోజులు క్రితం చాగల్లు మండలం బ్రాహ్మణ గూడెం గ్రామానికి గ్రామానికి చెందిన గారపాటి భాస్కరరావుకు చెందిన గేదెలు పొలంలో మేత మేస్తున్నాయి. ఒకటి రోడ్డు పక్కన పచ్చగడ్డి మేస్తుండగా అటు వెళుతున్న లారీ కుక్కను తప్పించబోయి పక్కనే ఉన్న ఎనిమిది నెలల చూడి గేదెను ఢీకొట్టింది. దీంతో వెనుక భాగానికి చెందిన కుడి కాలు నుజ్జునుజ్జు అయ్యింది. ప్రమాదం జరిన తర్వాత సమీపంలోని కలవ లపల్లి పశువుల ఆసుపత్రికి తీసుకెళ్ళడంతో అక్కడ వైద్యులు నేరుగా తణుకు ఆసుపత్రికి తీసుకెళ్ళాలని సూచించడంతో తణుకు తీసుకు వచ్చారు. ఆసుపత్రిలో డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ప్రసాదు ఆధ్వర్యంలో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్. రేమాల శ్రీధర్ ఆధర్యంలో నాలుగు గంటలు శ్రమించి కాలికి ఆపరేషన్ చేశారు. ఆపరేషన్‌లో అతి తక్కువ కాలంలోనే పశువు సాధారణ స్థితికి వచ్చేలా చేయడంలో డాక్టర్ శ్రీధర్ కృషి ఎనలేనిదని పలువురు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.ఆపరేషన్‌లో ఉపయోగించిన లిజార్ రింగ్‌లు ఖరీదైనవి. వాటిని రైతులు ఖర్చుపెట్టే పరిస్థితి ఉండదు. దానికి సంబంధించి రైతు లకు మేలు చేసేలా టీవీఐడీఎస్ (తణుకు వెటర్నరీ ఇన్‌స్టిట్యూషన్ డవలెప్‌మెంట్ సొసైటీ చైర్మెన్ ముళ్ళపూడి నరేంద్రనాథ్ ఆర్థిక సాయంతో లిజారో రింగ్‌లను అందించారు. దీంతో తక్కువ ఖర్చుతోనే రింగ్‌లు ఏర్పాటు చేయడంతో రైతులకు మేలు జరుగుతోంది.

నయమవుతుందని అనుకోలేదు



మా గేదెకు వంద శాతం డాక్టర్లు మేలు చేశారు. ప్రమాదం జరిగినపుడు గేదె కాలు నుజ్జు అయ్యింది. కాలు పనిచేస్తుందో లేదో అని ఆందోళన చెందాను. కాని ఇక్కడ డాక్టర్లు నాలుగు గంటలు పాటు శ్రమించి ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ చేసిన గంటల వ్యవధిలోనే రింగ్‌లు ఏర్పాటు వల్ల నెమ్మదిగా నడవడం చూసి చాలా ఆనందం వేసింది.
-గారపాటి భాస్కరరావు, రైతు

వీధి పశువుల వీరంగం

మొగుల్తూరులో నిత్యం ప్రధాన రహదారిపై ప్రమాదాలు



మొగల్తూరు,జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారులు, ప్రధాన కూడళ్ళలో గోవుల సంచారంపై స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.మొగల్తూరు మండలం మీదుగా జాతీయ రహదారి విస్తరించింది. జాతీయ రహదారితో పాటు మండల కేంద్రమైన మొగల్తూరు ప్రధాన కూడలి, వివిధ గ్రామాల్లో గల కూడళ్ళలో గో సంచారం ఎక్కువైంది. ఆవులు, గిత్తలు, ఆబోతులను వాటి యజమానులు వాటికి పశు గ్రాసం, లేదా ఇతర ఆహారాలు అందించకుండా రాత్రి, పగలు తేడా లేకుండా రోడ్లపై వది లేస్తున్నారు. రోడ్లపైకి వచ్చిన పశువులు పోట్లాడుకుంటూ స్థానికుల వాహనాలు ఢీకొనడం, మార్కెట్‌కు వచ్చేవారిపై ఆకలి మంటలతో దాడులు చేస్తున్నాయి. దీంతో పలువురు గాయాలపాలై నడుం, కాళ్ళు విరిగి తీవ్ర ఇబ్బందులు పడుతున్న సంఘటనలు చోటు చేసుకున్నాయి. గురువారం రాత్రి మొగల్తూరు ప్రధాన కూడలి మసీదు సెంటర్‌లో రెండు ఆబోతులు పొట్లాడుకున్నాయి. మసీదు వద్ద పార్కింగ్ చేసిన రెండు బైక్‌లను ధ్వంసం చేశాయి. పొట్లాటను ఆపబోయిన ఇరువురు వ్యక్తులపై దాడి చేశాయి.

ఈ-క్రాప్ ఇక్కట్లు

యాప్ సమస్యతో ఇబ్బంది పడుతున్న సిబ్బంది
చేల వద్ద రైతుల పడిగాపులు



జగన్నాథపురంలో చేలగట్టు వద్ద రైతుల పడిగాపులు

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఇక్రాప్ సమస్యతో వ్యవసాయ శాఖ సిబ్బంది సతమతమవుతున్నారు. గతంలో ఇ-క్రాప్ సర్వే నెంబర్‌కు 200 మీటర్ల దూరం వరకూ కో-ఆర్డినేట్స్ విజయవంతం అయ్యేది. కానీ ప్రస్తుతం ఆ యాప్‌లో 20 మీటర్లకు కుదించడంతో ఇటు సిబ్బంది ఇబ్బంది పడుతుంటే ఇక్రాప్ కావడంలేదని రైతులు మదనపడు తున్నారు. ముఖ్యంగా ఈ ఇక్రాప్ అయితే తప్ప తమకు ఇన్సూరెన్స్ కావడం లేదని రైతుల్లో గుబులు చెందుతున్నారు. తాజాగా తాడే పల్లిగూడెం మండలం జగన్నాధపురంలో ఇ-క్రాప్ చేయించుకోవడానికి రైతులు మూడు రోజులుగా వెంట పడుతుంటే ఒక పక్క సర్వర్ మరోపక్క యాప్ అప్‌డేషన్ సమస్యతో ఆలస్యం అవు తోందని ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం పంటల బీమాకు సంబంధించి ఆగస్టు 15 నాటికి ముగుస్తుండటంతో ఇక్రాప్ మాత్రం సెప్టెంబర్ నెలాఖరు వరకూ గడువు ఉంది. జిల్లాలో 3 లక్షల ఎకరాలు ఇ-క్రాప్ చేయాల్సి ఉండగా ప్రస్తుతం 10 శాతానికి ఇ-క్రాప్ జరుగుతోంది. ఒక్క తాడేపల్లిగూడెంలో 40 వేల ఎకరాలకు 25 వేల ఎకరాల్లో వరి, 15 వేల ఎకరం ఉద్యాన సాగు ఉందని 3,500 వరకూ ఇక్రాప్ పూర్తి చేశామని సిబ్బందికి అనుక్షణం అప్రమత్తం చేసి ఇ-క్రాప్ పూర్తిచేస్తున్నామని ఏవో నారాయణరావు తెలిపారు. ఈ-క్రాప్‌కు ఇన్సూరెన్స్‌కు సంబంధం ఉండదని స్పష్టం చేశారు.

పదోన్నతుల్లో పీఆర్ ఉపాధ్యాయులకు అన్యాయం

97శాతం ఉన్న పంచాయతీరాజ్ టీచర్లకు డీవైఈవో, ఎంఈవో-1 వంటి పోస్టుల్లో నియమించాలి
ఉపాధ్యాయ వర్గాల ఆందోళన

తణుకు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయు లకు పదోన్నతుల్లో తీవ్ర అన్యాయం జరుగు తుంది. రాష్ట్రవ్యాప్తంగా 97 శాతంగా ఉన్న పీఆర్ ఉపాధ్యాయులను కాదని కేవలం 3 శాతం కూడా లేని ప్రభుత్వ ఉపాధ్యాయులను డీవైఈవో, ఎంఈవో-1 వంటి పోస్టులు కట్టబెడుతున్నారు. ప్రభుత్వం తీసుకొనే నిర్ణయం వల్ల వేలాది మంది పంచా యతీరాజ్ ఉపాధ్యాయులు నష్టపోతున్నారని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఉమ్మడి పరీక్ష ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు అత్యధికంగా ఉన్నందున ఏకీకృత సర్వీసు రూల్స్ అమలు చేయడంలో ఎలాంటి న్యాయ అడ్డంకులు లేవని చెబుతున్నారు. ఒకే విద్యార్హతలో, ఒకే శిక్షణలో ఒకే జీత భత్యాలతో ఒకే ప్రభుత్వం కింద రెండు విభాగాలుగా (ప్రభుత్వ, పంచాయతీ రాజ్) ఉపాధ్యాయులుగా పని చేస్తున్నప్పటికీ తమకు అన్యాయం జరుగుతోందని పలువురు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో పాఠశాలలు ఇవే

జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యంలో పనిచేసే పాఠశాలలు ఆరు మాత్రమే ఉన్నాయి. వాటిలో 81 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. అలాగే జిల్లా పరిషత్, మండల పరిషత్ (పంచాయతీరాజ్ యాజమాన్యాల) పాఠశాలలు 15,70 ఉన్నాయి. వాటిలో 41 వేల 300 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఇంత వ్యత్యాసం ఉన్నప్పటికి ప్రభుత్వ ఉపాధ్యాయులకు మాత్రమే పదోన్నతలు లభిస్తున్నాయి. పంచాయితీరాజ్ ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతందని వాపోతున్నారు.

సీనియర్‌లను పక్కన పెట్టి...

సీనియర్ ఉపాధ్యాయులను ఎంఈవో-2గా నియమించి సర్వీసులో ఎంతో జూనియర్‌లైన ప్రభుత్వ యాజమాన్యంలో ఉన్న హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్‌లను ఎంఈవో-1గా నియమించడం వల్ల మెజారిటీ పీఆర్ ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతోంది. 97 శాతం ఉన్న పంచాయితీరాజ్ ఉపాధ్యాయులు తరతరాల నుంచి ప్రధానోపాధ్యాయులుగానే పదవీ విరమణ చేస్తున్నారు. అనేక పోరాటాలు చేసిన పంచాయతీరాజ్ ఉపాధ్యాయులు ప్రభుత్వం నుంచి సానుకూల ఉత్తర్వులు పొందారు. అయినప్పటికి ప్రభుత్వ ఉపాధ్యాయులు కోర్టును ఆశ్రయించి నిలుపుదల చేశారు. ఎంఇవో-1 ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఇవ్వవద్దని 2024లో కోర్టు ఉత్తర్వులు ఇచ్చినట్లు చెబుతున్నారు. దీనికి సంబంధించి స్టేటస్ కో అమల్లో ఉంది. ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులు ఇరువురికీ ప్రస్తుతానికి ఇవ్వవద్దని ఉత్తర్వులు ఉన్నాయి. కానీ ప్రస్తుతం ఎంఈవతో, డీవైఈవో పదవులు ప్రభుత్వ ఉపాధ్యాయులకే కట్టబెడుతున్నారు. కోర్టు తీర్పు ప్రకారం స్టేటస్ కో అమలు చేయాలి. 97 శాతం ఉన్న పంచాయతీ రాజ్ ఉపాధ్యాయులను కూడా ఎంఈవో-1, డీవైఈవో వంటి ఉన్నత ఉద్యోగాల్లో నియమించాలి.

అందరికీ సమానంగా పదోన్నతులు కల్పించాలి



ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు పంచాయితీ రాజ్ టీచర్లకు సమానంగా పదోన్నతులు కల్పించాలి. అదిక సంఖ్యలో ఉన్న ఉపాధ్యాయులను కాదని, అతి తక్కువ శాతం ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులకు పదోన్నతలు కట్టపెడుతున్నారు. దీనివల్ల పీఆర్ ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. ఉన్నతాధికారులు దృష్టి సారించాలి.
నేలపాటి వెంకట రమణ, హెచ్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు

ఎన్నో పోరాటాలతోనే సానుకూల ఉత్తర్వులు



పంచాయతీరాజ్ ఉపాధ్యాయులు ఎన్నో పోరాటాలు చేసి ప్రభుత్వం నుంచి సానుకూల ఉత్తర్వులు పొందాం. అయితే ప్రభుత్వ ఉపాధ్యాయులు కోర్టుకు వెళ్ళడం జరిగింది. ఉత్తర్వుల మేరకు పదోన్నతులు ఇవ్వకుండా ప్రభుత్వ ఉపాధ్యాయులకు పోస్టులు ఇస్తున్నారు.
ఎం.ఎస్ శ్రీమన్నారాయణ, ప్రధాన కార్యదర్శి



విన్నకోట కుశ్వంత్ ప్రణవరాజా, జోగాడ శివ శరణ్ తేజా

సౌత్ జోన్ క్రికెట్‌లో పాలకొల్లు విద్యార్థుల ప్రతిభ

పాలకొల్లు అర్బన్, జూలై 31(ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో జూలై 28, 29, 30, తేదీలలో జరిగిన సౌత్ జోన్ క్రికెట్ పోటీలలో ఆంధ్ర తరపున ఆడిన టీమ్‌లో పాలకొల్లుకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. స్థానిక విశ్వ జూనియర్ కళాశాలలో ఫస్ట్ ఇంటర్ చదువుతున్న విన్నకోట కుశ్వంత్ ప్రణవ రాజా (బ్యాటింగ్), జోగాడ శివ శరణ్ తేజ (బౌలింగ్) విభాగాల్లో ప్రతిభ కనపరిచి సెంట్రల్ జోన్‌పై విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించారు. మూడు రోజులపాటు జరిగిన పోటీల్లో టి-30, టి-20 వన్‌డే మ్యాచ్‌లు జరిగినట్టు విద్యార్థి కుశ్వంత్ ప్రణవ రాజా తండ్రి జనసేన పట్టణ ఉపాధ్యక్షుడు విన్నకోట గోపి తెలిపారు.



పోటీలను పరిశీలిస్తున్న వివిధ పాఠశాలల పీఈటీలు, కోచ్‌లు

సౌత్ ఇండియా స్థాయి క్రికెట్ పోటీలకు జట్టు ఎంపిక

దెందులూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు జట్టు ఎంపికైంది. మూడు రోజులుగా పెదవేగి మండలం లక్ష్మీపురంలోని జవహర్ నవోదయ అవరణలో జరిగిన ఎంపిక పోటీల్లో జవహర్ నవోదయ సౌత్ ఇండియా జట్టు క్రికెట్ జట్టు ఎంపిక చేసినట్టు జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ పరశురాయ్య అన్నారు.పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు నెలలో హర్యానా రాష్ట్రంలోని కురుక్షేత్రంలో జరగనున్న సౌత్ ఇండియా స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు. జవహర్ నవోదయ పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

25 శాతం టారిఫ్‌తో ఆక్వా రైతుపై ఎఫెక్ట్

రొయ్యకు ట్రంప్ గండం





అమెరికాకు ఆక్వా ఎగుమతుల్లో గోదావరి జిల్లాలే టాప్

- పన్నుల రూపేణా ఇప్పటికే 15 శాతం చెల్లింపులు
- తగ్గుముఖం పట్టిన రొయ్య ధరలు

ఆక్వా ఎగుమతులపై అమెరికా అధ్యక్షుడి డొనాల్డ్ ట్రంప్ ఎఫెక్ట్ భారీగా పడింది. భారత్‌పై 25 శాతం సుంకాలు విధించడంతో ఆక్వా రంగం తీవ్ర ఒడిదుడుకులకు లోనుకానుంది. రొయ్యల ఉత్పత్తులపై ఇప్పటికే టారిఫ్‌తోపాటు, వివిధ రకాల పన్నులన్నీ కలిపి 15 శాతం చెల్లిస్తున్నారు. ఇప్పుడు ఇది 25 శాతానికి పెరగడంతో ఆ మేరకు అంటే లక్షకు 25 వేల రూపాయలు పన్నులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్(ఎఫ్‌డీఏ) యాంటిబయోటిక్ ఆరోగ్య ప్రమాణాలను కఠినతరం చేసింది. దీనివల్ల మందులు ఎక్కువ వాడిన రొయ్యలను తిరస్కరించే ప్రమాదం వుంది. వీటిపై రైతులు, ట్రేడర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

(భీమవరం/ఆకివీడు రూరల్-ఆంధ్రజ్యోతి):

ఆక్వా రంగానికి ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు ఆయువుపట్టు. దేశ వ్యాప్తంగా విదేశాలకు ఎగుమతి అయ్యే రొయ్యల్లో మన రెండు జిల్లాల నుంచే సుమారు 60 శాతం ఉత్పత్తి చేస్తున్నారు. వీటి ద్వారా విదేశీ మారకద్రవ్యం రాబట్టడంలో ఈ జిల్లాలు కీలకంగా ఉన్నాయి. అందులో ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు ప్రత్యేక స్థానం ఉంది. భీమవరం కేంద్రంగా ప్రఖ్యాతి పొందిన ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయి.

ఒడిదుడుకుల్లో ధరలు

ట్రంప్ టారిఫ్ ఎఫెక్ట్ రొయ్య ఉత్పత్తుల ధరలపై పడింది. కొన్ని రోజుల క్రితం 100 కౌంట్ రొయ్యల ధర రూ.260కు కొనుగోలు చేశారు. గురువారం కిలోకు రూ.40 తగ్గిపోయింది. అమెరికాకు 30 నుంచి 40 కౌంట్ రొయ్యలు అత్యధికంగా ఎగుమతి అవుతుంటాయి. ధరలు అధికం. టారిఫ్ పెంపుదలతో కిలోకు రూ.40 వరకు ధరలు తగ్గించేశారు. జిల్లాలో గురువారం 30 కౌంట్ ధర రూ.470లకు కొనుగోలు చేశారు. టారిఫ్‌కంటే ముందు రూ.510లకు రైతుల వద్ద సేకరించేవారు. నాణ్యమైన ఉత్పత్తులనే అమెరికా దిగుమతి చేసుకుంటోంది. టారిఫ్ పెంపు ప్రకటనతో ధరలు తగ్గిపోయాన్నాయి. జిల్లా నుంచి అమెరికాకు రొయ్య ఎగుమతి చేయాలంటే 40 రోజుల వ్యవధి పడుతుంది. ఫలితంగా వ్యాపారులు ఇప్పటి నుంచే ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. వర్షాకాలానికి ఇటీవల కాలంలో రొయ్యకు పాత రోజులు వచ్చాయని అంతా ఆశించారు. ధరల విషయంలో పెరుగుదల కనిపించింది. ఎటువంటి వ్యాధి లేకుండా కౌంట్ వచ్చిన రైతులకు లాభసాటి అయ్యింది. తాజా ప్రకటనతో రొయ్య సాగు కుదుపునకు గురికానుందనే సమయంలోనే ఎగుమతిదారుల ధరలు బా విస్తున్నారు. అమెరికాలోను రొయ్యల ధరలు పెరగనున్నాయి. కాబట్టి కొంత వెసులుబాటు ఉంటుందంటూ ఎగుమతిదారులు ఆశిస్తున్నారు.

కేంద్రం ప్రోత్సాహకాలు ఇవ్వాలి

దేశీయంగా కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలు కల్పిస్తే కొంత మేర గట్టెక్కే అవకాశం ఉంటుంది. ఐదేళ్ల రాష్ట్ర ప్రభుత్వం ఆక్వా రంగాన్ని పరిశ్రమగా గుర్తించింది. మేత ధరలు తగ్గించింది. రూ.1.50కే యూనిట్ విద్యుత్ సరఫరా చేస్తోంది. ఆక్వా జోన్లను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటోంది. అదే జరిగితే మరింత మంది రైతులకు విద్యుత్ రాయితీ లభిస్తుంది. ఇదే సమయంలో కేంద్రం కూడా రాయితీలు కల్పిస్తే అమెరికా విధించిన టారిఫ్ నుంచి గట్టెక్కే అవకాశం ఉందని అటు వ్యాపారులు, ఇటు రైతులు ఆశిస్తున్నారు. ఒక్కో ప్రాసెసింగ్ యూనిట్‌లో 2000 నుంచి 3000 మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నారు. అమెరికా తాజా టారిఫ్‌తో కొంత మేర ఆక్వా పరిశ్రమ ఒడిదుడుకుల లోను కానుంది. చైనాకు ఎగుమతులు పెంచే అవకాశం ఉంటుంది. అదే జరిగితే చైనా కూడా బేరసారాలకు దిగే అవకాశాలు ఉన్నాయి. మొత్తంగా రొయ్య ధరలు తగ్గుముఖం పడతాయి. రైతులకు గిట్టుబాటు కాకపోతే సాగు విరమించుకుంటారు. అదే జరిగితే ప్రాసెసింగ్ యూనిట్లపై ప్రభావం పడుతుంది.

95 శాతం సాగు రొయ్యలే వినియోగం

- దేశవ్యాప్తంగా ఏటా 10-11 లక్షల టన్నుల రొయ్యలు ఉత్పత్తి అవుతున్నాయి. అందులో ఉభయ గోదావరి జిల్లాల్లోనే ఆరు లక్షల టన్నులు ఉత్పత్తి చేస్తున్నారు. అంటే సుమారు 60 శాతం ఉత్పత్తులు ఈ రెండు జిల్లాల నుంచే వెళుతున్నాయి.
- ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా సాగు చేసిన రొయ్యలనే 95 శాతం మంది వినియోగిస్తున్నారు. సముద్రం నుంచి ఉత్పత్తి అయ్యే రొయ్యల వినియోగం కేవలం ఐదు శాతం మాత్రమే ఉంది.
- పశ్చిమ గోదావరి జిల్లాలోనే మూడు లక్షల టన్నుల రొయ్యల ఉత్పత్తి జరుగుతోంది. అందులో అమెరికాకు 70 శాతం, చైనాకు 30 శాతం ఎగుమతి అవుతున్నాయి.

దేశీయ మార్కెట్‌ను ప్రోత్సహించాలి



రైతు ఉత్పత్తుల ధరలు ఇతర దేశాలు శాసించే విధంగా కాకుండా దేశీయ మార్కెట్‌ను ప్రోత్సహించాలి. ప్రోటీన్ అధికంగా ఉండే రొయ్యల ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసి దేశంలోని ప్రజలు తీసుకునే విధంగా చైతన్యం తీసుకురావాలి. కోడి గుడ్డ కోసం ఏర్పాటు చేసిన నెక్ మాదిరి ఆక్వా బోర్డును ఏర్పాటు చేసి దేశంలోని ప్రజలకు అందు బాటులోకి తీసుకురావాలి.

- జీకేఎఫ్ సుబ్బరాజు, ప్రాన్ ఫార్మర్ వెల్ఫేర్ ఫెడరేషన్ కార్యదర్శి, పశ్చిమ గోదావరి జిల్లా

విద్యుత్ సబ్సిడీని అందించాలి



ప్రస్తుతం 54 వేల కనెక్షన్లకు విద్యుత్ సబ్సిడీ అందజేస్తున్నారు, మిగిలిన 19వేల కనెక్షన్లకు ఇవ్వాలి. రాయితీలపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను అందించాలి. నాణ్యమైన సీడ్ ప్రభుత్వమే సరఫరా చేయాలి. హేచరీలపై నిఘా వేసి నాణ్యతను పరీక్షించాలి. ప్రభుత్వమే మార్కెట్ కమిటీల ద్వారా కోల్డ్ స్టోరేజీలు నిర్మించి రిటైల్ మార్కెట్‌లు ఏర్పాటు చేయాలి.

- పిల్లా బాబులు, ఆక్వా రైతు మహిపాడ

ట్రంప్ ఫియర్

- స్టాక్ మార్కెట్ కుదేలు
- మదుపుదారుల్లో ఆందోళన

నరసాపురం : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫియర్ స్టాక్ మార్కెట్లను వీడడం లేదు. రెండు, మూడు నెలలుగా ట్రంప్ ఏదో ఒక ప్రకటన చేయడం ఆ ప్రభావం మార్కెట్‌పై పడుతుండడంతో ఇండెక్స్ సూచీలు నేలకొరుగుతున్నాయి. గురువారం మార్కెట్‌పైన దీని ప్రభావం పడింది. అధికారికంగా భారత్‌ ఎగుమతి చేసే వస్తువులపై 25 శాతం పన్ను వేస్తానని చెప్పడంతో మార్కెట్లు ఆరంభంలోనే కుప్పకూలాయి. తర్వాత కొద్దిగా రికవరీ అయినా.. చివరి వరకు నిలబడలేదు. మరోవైపు సుంకాలతోపాటు రష్యా నుంచి ఆయిల్ దిగుమతి చేసుకుంటే భారీ జరిమానా తప్పదని భారత్‌ను హెచ్చరించడం మార్కెట్‌పై పడింది. రానున్న రోజుల్లో సూచీలు ఏ విధంగా ఉంటాయోనన్న భయం జిల్లా మదుపుదారుల్లో నెలకొంది. రెండునెలల నుంచి వరుస పతనాలతో మదుపుదారులు భారీగా నష్టపోయారు. గత ఏడాది వరకు మార్కెట్ లాభదాయకంగా ఉండడంతో చాలా మంది మదుపుదారులు స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెడుతూ వచ్చారు. ట్రంప్ పగ్గాలు చేపట్టినప్పటి నుంచి మార్కెట్‌లో తీవ్ర ఒడిదుడుకుల్ని ఎదుర్కొం టుంది. జిల్లాలో నరసాపురం, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పెనుగొండ, మార్టేరు, ఆకివీడు, పాలకొల్లు వంటి ప్రాంతాల్లో చాలా మంది మదుపుదారులు స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెడుతూ వస్తున్నారు. మార్కెట్ పతనంతో వీరి ఆశలన్నీ ఆడియాసలయ్యాయి. ఇప్పటికే నష్టాలను మూటగట్టుకున్న చాలా మంది ఆయినకాడికి అమ్ముకుని మార్కెట్ నుంచి బయటకు వచ్చేస్తున్నారు.

ట్రంపు వల్లే.. మార్కెట్‌లో ఒడిదుడుకులు



భారత ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉంది. నాలుగేళ్ల నుంచి మార్కెట్‌లో పెట్టిన పెట్టుబడులకు భారీ లాభాలు వచ్చాయి. ట్రంపు అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పరిస్థితులు మారాయి. కొత్తగా దిగుమతులపై భారీగా సుంకాలు విధింపు, భారతీయులను అమెరికాలో ఉద్యోగాలు ఇవ్వవద్దని తదితర పరిణామాలు మార్కెట్‌పై పడుతున్నాయి. ఈ కారణంగా మార్కెట్ తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతోంది. మదుపుదారుల నష్టాలకు ఇదే కారణం.

- రవికుమార్, స్టాక్ మార్కెట్ బ్రోకర్, నరసాపురం

జాతీయ రహదారులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోండి

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కోరిన మంత్రి వర్మ



గడ్కరీతో మాట్లాడుతున్న కేంద్ర సహాయమంత్రి శ్రీనివాస వర్మ

భీమవరం టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో నిర్మిస్తున్న పలు జాతీయ రహదారుల ప్రాజెక్టుల పురోగతి, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై కేంద్ర రవాణా శాఖ మంత్రి గడ్కరీతో మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ గురువారం న్యూఢిల్లీలో చర్చించారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణం, విస్తరణ పనులు వేగంగా పూర్తయ్యేలా చూడాలని మంత్రి శ్రీనివాస వర్మ గడ్కరీని కోరారు. నర్సాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని రెండు అత్యంత కీలకమైన జాతీయ రహదారుల నిర్మాణ ఆవశ్యకతను నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకువెళ్లారు. దిగమర్రు- ఆకివీడు రహదారి ఎన్‌హెచ్-165, ఎన్‌హెచ్- 216లో భాగంగా నరసాపురం బైపాస్ రహదారి (కత్తిపూడి-ఒంగోలు) ప్రాధాన్యతను వివరించారు. వీటి నిర్మాణం పూర్తి అయితే భీమవరం పట్టణ ట్రాఫిక్ సమస్య తీరడంతో పాటు నరసాపురం పట్టణంలో వాహనాల రద్దీ తగ్గి సుళువైన ప్రయాణానికి మార్గం ఏర్పడుతుందని వివరించారు. కొంతకాలంగా నిలిచిపోయిన నరసాపురం బైపాస్ పనులను తక్షణమే పునఃప్రారంభించాలని గడ్కరీకి విజ్ఞప్తి చేశారు. జాతీయ రహదారుల నిర్మాణం జాప్యం స్థానిక ప్రజలకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తోంది, నిర్మాణ పనులను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ రెండు ప్రాజెక్టులు స్థానిక ప్రజల రవాణా అవసరాలను తీర్చడమే కాకుండా, జిల్లా ప్రాంత ఆర్థికాభివృద్ధికి దోహద పడతాయని వివరించారు. కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని గడ్కరీ హామీ ఇచ్చినట్టు శ్రీనివాస వర్మ తెలిపారు.

రేపు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

ఏలూరుసిటీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఆగస్టు 2వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి ఏలూరులోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతుందని జిల్లా పరిషత్ సీఈఓ ఎం శ్రీహరి తెలిపారు. ఈ సమావేశానికి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షత వహిస్తారని వివరించారు.

ముగ్గురు వైద్యులపై విచారణకు ప్రభుత్వం ఆదేశం

ఏలూరు క్రైం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఏలూరులో ఉన్న ప్రభుత్వాసుపత్రిలో గతంలో పనిచేసిన ముగ్గురు వైద్యులపై శాఖాపరమైన విచారణ జరపాలని ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వైద్య విధాన పరిషత్ ఆధీనంలో ఏలూరు జిల్లా ప్రభుత్వాసుపత్రి ఉన్న సమయంలో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పనిచేసిన ఈఎన్‌టీ విభాగం వైద్యుడు డాక్టర్ స్వర్ణ శ్రీనివాస్, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, మానసిక వైద్య చికిత్స విభాగంలో పనిచేసిన డాక్టర్ తవ్వా రామ్మోహనరావులు జారీ చేసిన సదరం సర్టిఫికెట్లలో అవకతవకలు ఉన్నట్టుగా ప్రభుత్వం ఏపీవీపీ అధికారులతో జరిపిన విచారణలో తేలింది. ఈ నేపథ్యంలో వారిపైన శాఖాపరమైన విచారణ జరపాలని గురువారం ఆదేశించింది. డాక్టర్ స్వర్ణ శ్రీనివాస్ స్వచ్ఛంద పదవీ విరమణ చేయగా డాక్టర్ రాజేంద్రప్రసాద్ ప్రస్తుతం విధుల్లో కొనసాగుతున్నారు. డాక్టర్ తవ్వా రామ్మోహనరావు పదవీ విరమణ చేశారు.

రైలు ఢీకొని బీటెక్ విద్యార్థిని మృతి



ఏలూరుక్రైం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గేటు వద్ద పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో ఒక విద్యార్థిని అక్కడికక్కడే మృతి చెందింది. దెందులూరు మండలం సీతంపేట గ్రామానికి చెందిన గాజులపాటి పూజిత(20) బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. గురువారం గ్రామ సీతంపేట గ్రామంలో ఉన్న రైల్వే గేటును దాటి వెళుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొట్టింది. సమాచారం అందుకున్న ఏలూరు రైల్వే ఎస్‌ఐ శివనారాయణ తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లిపరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని శుక్రవారం ఉదయం ఘటనా స్థలం నుంచి ప్రభుత్వ ఆస్పత్రి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

నూజివీడులో జోరుగా జూదాలు

అధికార పార్టీ చోటా నాయకులే నిర్వాహకులు !.. పరస్పర సహకారంతో పోలీసు యంత్రాంగం

నూజివీడు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నూజివీడు నియోజకవర్గంలో పది రోజుల నుంచి జోరుగా జూదాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. నియోజకవర్గంలో మండలాల వారీగా జూదాలు నిర్వహణ పంచుకున్నట్లుగా కనిపిస్తోంది. ముసునూరు, చాట్రాయి మండలాల్లో కోడి పందేలు, ఆగిరిపల్లి, నూజివీడు మండలాల్లోని పలు గ్రామాల్లో పేకాట జోరుగా సాగుతున్నాయి. ఈ పోటీలకు నూజివీడు నియోజకవర్గంతో పాటు ఏలూరు, గుడివాడ, చింతలపూడి, గన్నవరం, మచిలీపట్నం, అవనిగడ్డ ప్రాంతాల నుంచి జూదరులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నట్లు సమాచారం. ఈ జూదాల నిర్వాహకులు అందరూ స్థానిక అధికార పార్టీకి చెందిన చోటామోటా నాయకులు కావడం విశేషం. ఈ పోటీలను నిర్వాహకులు రోజుకు ఒక గ్రామంలో పామాయిల్, మామిడి తోటల్లో రహస్యంగా నిర్వహిస్తూ ప్రజల జేబులను కొల్లగొడుతున్నారు. ఈ జూదాల నిర్వాహకులు అందరూ నియోజకవర్గ శాసనసభ్యుడు మంత్రి కె.పార్థసారథి ఇలాకాలోని వారు కావడంతో పోలీసులు పూర్తి సహకారంతో ఇచ్చిపుచ్చుకునే ధోరణి పాటిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. గురువారం కూటమి ప్రభుత్వంలోని మిత్రపక్షమైన స్థానిక జనసైనికుడు ఒకరు సోషల్ మీడియాలో నూజివీడు నియోజకవర్గంలో జరుగుతున్న ఈ జూదాలను అరికట్టాలని పోలీసులను కోరుతూ చేసిన విజ్ఞప్తి నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. ఐదు రోజుల నుంచి పలు జూదాల వర్గాలతో ఒక మంత్రి సారథి శుక్రవారం నూజివీడు రానున్నట్లు సమాచారం. ఈ జూదాల నిర్వహణపై ఏవిధంగా స్పందిస్తారో వేచి చూడాలి.

పోలీసుల సూచనలు పాటిస్తే సమస్యలుండవ్



ఎస్పీ ముందు నాటిక ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

ఏలూరు క్రైం, జూలై 31(ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేసే వారికి చెక్ పెట్టాలంటే పోలీసుల సూచనలు పాటించాలని ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు అన్నారు. జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు ఏలూరు సమీపంలోని వట్లూరులో ఉన్న సీఆర్ఆర్ పాలిటెక్నిక్ కాలేజీలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సును ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో త్రీ టౌన్ సీఐ కోటేశ్వరరావు, ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీ మాట్లాడుతూ యువత సైబర్ నేరాలపై అవగాహన కల్గి ఉండాలన్నారు. వ్యక్తిగత సమాచారం బహిరంగ గుర్తుండం వల్ల ఎన్నో ప్రమాదాలు ఉన్నాయన్నారు. అత్యవసర పరిస్థితుల్లో బాధితులు 112కి, సైబర్ నేరాలకు 1930కు సమాచారం అందించాలన్నారు. శ్రీ టీమ్ ఆధ్వర్యంలో అవగాహన నాటికను వివరించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కేంద్రం చర్యలు : ఎంపీ

ఏలూరుటూటౌన్, జూలై31(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు కేంద్రం చర్యలు తీసుకుంటోందని ఎంపీ మహేశ్‌కుమార్ అన్నారు. పార్లమెంట్‌లో మహేశ్ అడిగిన ప్రశ్నలకు కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ సమాధానం ఇచ్చారు. గన్నవరం నుంచి నల్లజర్ల వరకు హైవేపై ప్రమాదాల నివారణకు సైన్ బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, భద్రత వంటి అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. ప్రయాణికుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు మంత్రి స్పష్టం చేశారని ఎంపీ తెలిపారు.

హాస్టల్లో మద్యం, సిగరెట్లు

- చెడు మార్గంలో వెళ్తున్న విద్యార్థులు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- విద్యార్థి సంఘాల ఆందోళన



హాస్టల్ ఆవరణలో ఉన్న బైనీ, మద్యం, డ్రింక్ ఖాళీ సీసాలు

ఏలూరు రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): వసతి గృహాల పరిస్థితి అధ్వానంగా తయారైంది. హాస్టల్లో ఉండే కళాశాల విద్యార్థులు మద్యం సేవించి, సిగరెట్లు తాగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. విద్యార్థులు ఇష్టమొచ్చినట్టు వ్యవహరిస్తున్నారు. మద్యం, సిగరెట్లు, గుట్కా, పాక్కెట్టు నమూలతో హాస్టల్ ప్రాంగణంలోనే వాటిని పడేసిన ప్రత్యక్ష ఘటన వెలుగులోకి వచ్చింది. హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యం, అధికారులు పట్టించుకోకపోవడంతో విద్యార్థులు చెడు అలవాట్లకు పాల్పడుతున్నారని విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి.

అధికారుల్లో ఉదాసీనత?

హాస్టల్లో అధికారుల తీరుతోనే ఈ పరిస్థితి. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గత వారం ఏలూరు జిల్లాలో అన్ని హాస్టల్స్ సర్వే చేస్తున్నారు. సర్వేలో భాగంగా ఏలూరు సాంఘిక సంక్షేమ కళాశాల సర్వేలో విస్తుపోయే ఘటనలు వెలుగు చూశాయి. బుధవారం రాత్రి ఎస్సీ బాలుర కళాశాల హాస్టల్ సర్వే చేయగా సిగరెట్లు, మద్యం సేవించేవారు ఎక్కువశాతం ఉన్నట్లు గుర్తించారు. హాస్టల్ దాబా పైన రాత్రి 10 నుంచి 12 గంటల మధ్యలో హాస్టల్ విద్యార్థులు బయట వ్యక్తులతో కలిసి మద్యం తాగుతున్నట్లు గుర్తించారు. వార్డెన్ వారించినా వినడం లేదని మిగతా విద్యార్థులు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు హాస్టల్ వైపు కన్నెత్తి చూడటం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఏడాది అడ్మిషన్ 50 శాతానికి మించిపడిపోయింది. 20 మంది ఉండాల్సిన ఒక గదిలో ఆరుగురు నుంచి పదిమంది పడిపోయారు. ఉన్నతంగా ఉండాల్సిన విద్యార్థులు ఇలా చెడు వ్యసనాలకు అలవాటు పడటం హాస్టల్ అధికారుల ఉదాసీనతే కారణమని ఎస్ఎఫ్ఐ నాయకులు ఆరోపిస్తున్నారు. ఇటువంటి ఘటనలు కట్టడి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె లెనిన్ డిమాండ్ చేశారు.



వాహనాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

యడవల్లిలో నకిలీ ఎరువులు స్వాధీనం

ఏలూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): వర్షాలు వెనకడుగు వేయడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతులపై నకిలీల బెడద ఎక్కువైంది. సాగు భారమవుతున్నా ఎరువులు కొనేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. రైతుల అవసరాలను ఆసరా చేసుకుని కొందరు వ్యాపారులు అక్రమాలకు తెగబడుతున్నారు. కల్తీ ఎరువులను రైతులకు అంటగడుతూ నట్టేట ముంచుతున్నారు. ఈ సందర్భంగా మండలంలోని యడవల్లిలో ఎటువంటి అనుమతులు లేని నాసిరకం ఎరువుల బస్తాలను వాహనంలో తరలిస్తున్నారనే సమాచారం అందడంతో జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ ఏడీ సుబ్బారావు, సిబ్బంది నిఘా వేసి గురువారం తెల్లవారు జామున ఎరువుల బస్తాలతో వస్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా అందులో రూ.వంద లక్షల విలువైన 140 బస్తాల్లో ఉన్న ఏడు టన్నుల నాసిరకం ఎరువుల బస్తాలను గుర్తించి వాహనాన్ని అందులోని డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. వాహనంలో 80 బస్తాల్లో - డీఏపీ, 20 బస్తాలో-1026, 20 బస్తాలో -1435, 20 బస్తాలో 20-20 ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వాహనాన్ని, ఎరువులను స్వాధీనం చేసుకుని నిందితులపై 6ఏ కేసు నమోదు చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా తెలిపారు. నకిలీ విత్తనాలు,ఎరువులు, పురుగు మందులు విక్రయించి రైతులను మోసం చేసే డీలర్లు, వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో లింగపాలెం, చింతలపూడి మండలాల వ్యవసాయాధికారులు ఎ.ప్రదీప్ కుమార్, కె.మురళీకృష్ణ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, జూలై 31(ఆంధ్రజ్యోతి): మద్యం తాగవద్దని కుమారుడు మందలించడంతో తండ్రి మనస్థాపానికి గురై పురుగుల మందు తాగడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. జాలిపూడి గ్రామానికి చెందిన కందెల్లి తంబి(40) చేపల చెరువులపై పనిచేస్తూ జీవిస్తున్నాడు. గత నెల 29న అతిగా మద్యం తాగి రావడంతో కొడుకు మందలించాడు. మనస్తాపానికి గురై పురుగుమందు తాగాడు. చికిత్స పొందుతూ మృతి చెందడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పోడూరు,జూలై 31(ఆంధ్రజ్యోతి): పాలకొల్లు - మార్టేరు రోడ్డులో జగన్నాథపురం స్మశానవాటిక సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. పెనుమంట్ర మండలం నెగ్గిపూడికి చెందిన ఉసికెల త్రిమూర్తులు(35) యలమంచిలి మండలం కాజ వెళ్లి స్వగ్రామం నెగ్గిపూడి వస్తుండగా ఐషర్ వాహనం ఢీకొట్టింది. దీంతో త్రిమూర్తులు అక్కడికక్కడే మృతి చెందారు. తల్లి సుబ్బలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి కేసు నమోదు చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

భీమవరం క్రైం, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఒక వ్యక్తి ఉరి వేసుకుని చికిత్స పొందుతూ మృతి చెందినట్టు భీమవరం రూరల్ హెడ్ కానిస్టేబుల్ వెంకటరెడ్డి తెలిపారు. భీమవరం మండలం గూట్లపాడుకు చెందిన మోకా దానయ్య(50) గత నెల 17న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేయడంతో బంధువులు విజయవాడ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడని వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని యువకుడి మృతి

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): అడ్డువచ్చిన కుక్కను తప్పించబోయి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన నవాబుపాలెంలో గురువారం చోటు చేసుకుంది. జగన్నాథపురానికి చెందిన దండే శ్రీను(21) తాడేపల్లిగూడెం నుంచి జగన్నాథపురం మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా కుక్కను తప్పించే క్రమంలో ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు 108 వాహనంలో గూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్.ఐ. ప్రసాద్ తెలిపారు.

ఆటోను బలంగా ఢీకొట్టిన ఐషర్ వ్యాను

- అక్కడికక్కడే యువకుడు మృతి
- మరో ఆరుగురికి తీవ్ర గాయాలు



ఆటో వద్ద మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఏలూరు క్రైం, జూలై 31(ఆంధ్రజ్యోతి): చెరువులో రొయ్యలు పట్టడానికి కూలీలతో ఆటోలో వెళుతుండగా ఎదురుగా వచ్చిన ఐషర్ వ్యాన్ ఢీకొట్టడంతో ఒక కూలీ అక్కడికక్కడే మృతి చెందగా మరో ఆరుగురు తీవ్రగాయాలపాలయ్యారు. తూర్పుగోదావరి జిల్లా కవిటేశ్వరం మండలం కోరుమిల్లి గ్రామానికి చెందిన కొంతమంది కూలీలు ముదునూరు మండలంలో చెరువులో రొయ్యలు పట్టడానికి ఆటోలో గురువారం వేకువ జామున బయలుదేరి వెళ్తున్నారు. మార్గ మధ్యంలో ఏలూరు రూరల్ మండలం శ్రీపర్రుకు రోడ్డుపైనే కంకర రాళ్లు పోసి ఉండడంతో వాటిని ఆటో డ్రైవర్ తప్పించే క్రమంలో కైకలూరు వైపు వస్తున్న ఐషర్ వ్యాను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒడిపాకు చెందిన సంజయ్ కుమార్(19) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ఉన్న కోరుమిల్లికి చెందిన ఆకుల హరీశ్(23), నాగిడి రాంబాబు, పంపన సురేష్, బీర రాంబాబు, బసవాని లక్ష్మణ్, సూరజ్ కుమార్లు తీవ్రంగా గాయపడగా ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.ప్రమాదానికి కారణమైన ఐషర్ వ్యాను డ్రైవర్లు, గ్రావెల్‌ను రోడ్డుపై పోసిన ముంగర శేఖర్‌పై కేసు నమోదు చేశారు.

మద్యం కేసులో మరొకరి అరెస్టు

భీమవరం క్రైం, జూలై 31(ఆంధ్రజ్యోతి): యానాం, గోవా నుంచి అక్రమంగా మద్యం తీసుకొచ్చి విక్రయిస్తున్న కేసులో మరొకరిని అరెస్ట్ చేసినట్టు భీమవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ బలరామరాజు గురువారం తెలిపారు. ఇప్పటికే ఈ కేసులో ఇద్దరిని అరెస్ట్ చేయగా యానానికి చెందిన కుప్పసత్తి వీరబాబును గురువారం అరెస్ట్ చేసినట్టు తెలిపారు. ఈ కేసులో మరికొంత మందిని అరెస్ట్ చేయాల్సి ఉందని సీఐ బలరామరాజు తెలిపారు. ఈ దాడిలో ఎస్‌ఐలు ఉమామహేశ్వరరావు, సునీల్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

పాలకొల్లు టౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలో గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం పాలయ్యారు. నరసాపురానికి చెందిన వేశ్వేరు ప్రసాద్(38)సుజికీ షోరూంలో పనిచేస్తున్నాడు. బండి డెలివరీ నిమిత్తం మార్టేరు వెళ్తుండగా నరసాపురం రోడ్డు అయ్యప్పస్వామి గుడి సమీపంలో లారీని ఓవర్‌టేక్ చేయబోయి వెనుక చక్రం కింద పడిపోవడంతో అక్కడికక్కడే మరణించాడు. దీనిపై పట్టణ ఎస్ఐ పృథ్వీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామని పోలీసులు తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

భీమవరం క్రైం, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆకివీడు- ఉండి రైల్వే స్టేషన్ మధ్య గుర్తు తెలియని సుమారు 55 సంవత్సరాలు గల వ్యక్తి రైలు నుంచి జారిపడి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు భీమవరం జీఆర్పీ రైల్వే ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం ఉదయం ఆకివీడు- ఉండి రైల్వే స్టేషన్ మధ్య ఒక వ్యక్తి జారిపడ్డాడని సమాచారం రాగా ఆతడిని భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం నిమిత్తం తీసుకెళ్లారని తెలిపారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఏలూరు జిల్లా ఆసుపత్రికి పంపగా, అక్కడ ఆ వ్యక్తి మృతి చెందినట్టు జిల్లా ఆస్పత్రి వైద్యులు సమాచారం ఇవ్వడంతో గుర్తు తెలియని వ్యక్తి వివరాలు సేకరించినట్టు తెలిపారు. ఈ వ్యక్తికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే 9908448729 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

లారీ నుంచి జారి పడి మరొకరు..

పేరుపాలెం లోడు పనికి వెళ్లి అక్కడ లారీ పై నుంచి జారి పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు భీమవరం రూరల్ హెడ్ కానిస్టేబుల్ వెంకటరెడ్డి గురువారం తెలిపారు. ఏలూరు జిల్లా గణపవరం మండలం సత్యా దానియేలు(48) గత నెల 22న చేపల ప్యాకింగ్ పని నిమిత్తం లారీపై భీమవరం మండలం గూట్లపాడు వెళ్లాడు. అక్కడ లోడు ముగిసిన అనంతరం లారీ ఎక్కుతుండగా జారి కింద పడ్డాడు. తీవ్ర గాయాలైన అతనిని విజయవాడ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్టు ఆసుపత్రి సమాచారంతో భీమవరం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏటీఎంలో నగదు సేఫ్

ఆకివీడు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఏటీఎంలో నగదు భద్రంగానే ఉందని సీఐ జగదీశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక గుమ్ములూరు సెంటర్‌లో ఉన్న ఎస్బీఐ ఏటీఎంలోకి పట్టపగలు ఒక వ్యక్తి వెళ్లి డోర్ అద్దం పగలుకొట్టి వెళ్ళిపోయాడు. సమీపంలోని వ్యక్తులు పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. దీంతో సీఐ జగదీశ్వరరావు ఎస్బీఐ అధికారులతో మాట్లాడడంతో అధికారి వచ్చి పరిశీలించగా నగదు అంతా భద్రంగానే ఉందనడంతో ఊపిరి పీల్చుకున్నారు. మద్యం మత్తులో ఈ సంఘటన జరిగి ఉంటుందని అంటున్నారు.

నీటి తీరువా చెల్లించండి

అత్తిలి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : అత్తిలి మండలంలోని రైతులు అపరాధ రుసుం లేకుండా ఆగస్టు నెలలో నీటి తీరువాను చెల్లించాలని తహసీల్దార్ దశిక వంశీ కోరారు. రైతులు 1431వ ఫసలి నుంచి 4 ఫసలీలకు సంబంధించిన నీటి తీరువా బకాయి ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వం వన్‌టైంగా నీటి తీరువా చెల్లించే అవకాశం ఇచ్చిందని తెలిపారు. ఇంతకు ముందు 6 శాతం వడ్డీతో నీటి తీరువా చెల్లించాల్సి వచ్చేదని అన్నారు. ఇప్పుడు వడ్డీ అపరాధ రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని అన్నారు.

కార్డుదారుల ఇళ్లకు వెళ్ళి తనిఖీ

ఆకివీడు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : రేషన్ డీలర్లు కార్డుదారులకు సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని, ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ నండూరి వెంకటేశ్వరరావు హెచ్చరించారు. గురువారం రెవెన్యూ అధికారులు ఇళ్ళకు వెళ్ళి విచారణ చేశారు. సరుకులు సక్రమంగా అందుతున్నాయా అంటూ ప్రశ్నించారు. వృద్ధులు, వికలాంగులకు డీలర్లు ఇళ్లకు వచ్చి సరుకులు ఇవ్వకపోయినా తమకు ఫిర్యాదులు చేయాలని సూచించారు.

ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవు

కార్డు దారులకు ప్రభుత్వం సన్న బియ్యం సరఫరా చేస్తున్నదని, డీలర్లు సక్రమంగా సరుకులు సరఫరా చేయాలని ఏఎస్‌వో రవిశంకర్ అన్నారు.గురువారం తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఫిర్యాదులు వస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్ఐ ఆంజనేయులు, డీలర్లు సంఘం మండల అధ్యక్షుడు మాణిక్యాలరావు, కార్యదర్శి దరిశే శ్రీను, డీలర్లు ఉన్నారు.

154 స్పౌజ్ పింఛన్‌లు మంజూరు

ఆచంట, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆచంట మండలంలో భర్తను కోల్పోయిన వితంతువులకు 154 కొత్త పింఛన్‌లు మంజూరు అయ్యాయని ఎంపీడీవో బి. కృష్ణమోహన్ తెలిపారు. గురువారం ఎంపీడీవో కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శులు, విజన్‌టీమ్ సభ్యులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్తగా మంజూరు అయిన పింఛన్‌లను ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు నాయకుల సమక్షంలో పంపిణీకి చర్యలు చేపట్టాలని కార్యదర్శులను ఆదేశించారు.

తగ్గుతున్న వరద గోదావరి

ఆచంట/పెనుగొండ, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలు కారణంగా వారం రోజులుపాటు గోదావరి ప్రవాహం పెరగడంతో పుష్కరఘాట్‌లు నీట మునిగాయి. అయితే గురువారం నుంచి వరద ప్రవాహం కాస్త తగ్గుముఖం పట్టడంతో సిద్ధాంతం, నడిపూడిలో పుష్కరఘాట్‌లు బయట పడుతున్నాయి. గోదావరిలో పడవలు రాకపోకలు యథావిధిగా తిరుగుతున్నాయి.

సొసైటీలు రైతులకు అండగా ఉండాలి


అరట్లకట్ట సొసైటీ చైర్మెన్ కుమారస్వామిరాజును అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్సీ అంగర

పాలకొల్లు రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలు రైతులకు అండగా ఉండాలని, దీనికి త్రిసభ్య కమిటీలు బాధ్యతగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ కోరారు. అరట్లకట్ట సొసైటీ చెర్మన్‌గా పొత్తూరి కుమారస్వామిరాజు, సభ్యులుగా చింతపల్లి సత్యనారాయణ, పోలిశెట్టి రామకృష్ణ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కర్, లంకలకోడేరు నీటిసంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, గోరింటాడ సొసైటీ చెర్మన్ బోడపాటి వెంకటనారాయణ జిల్లా జనసేన నాయకుడు తులా రామలింగేశ్వరరావు, టీడీపీ క్లస్టర్ ఇనిఛార్జ్ అంగర చిన్న పాల్గొన్నారు.

యలమంచిలి: చించినాడ సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గా రుద్రరాజు సత్యనారాయణరాజు, సభ్యులుగా కొప్పినీడి వెంకటసత్యనారాయణ, కవురు శ్రీనివాస్ గురువారం ప్రమాణస్వీకారం చేశారు. చించినాడ సొసైటీ వద్ద టీడీపీ మండల అధ్యక్షుడు మామిడిశెట్టి పెద్దిరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, పాలకొల్లు ఏఎంసీ ఛైర్మన్ కోడి విజయభాస్కర్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.

ఆక్వా చెరువు వద్ద యువకుడి మృతి

ఆచంట, జూలై 31(ఆంధ్రజ్యోతి): శేషమ్మచెరువు గ్రామానికి చెందిన చిలుకూరి వెంకట్రావుకు చెందిన రొయ్యల చెరువులు వద్ద ఒరిస్సా రాష్ట్రం రాయగడ జిల్లా దంగలాడికి చెందిన ఆకాష్ కిలకా అనే వ్యక్తి మూడు సంవత్సరాల నుంచి పని చేస్తున్నాడు. ఆకాష్ స్నేహితుడు హరిష్ చంద్ర పూల(25) సుమారు పదిహేను రోజుల క్రితం నుంచి పనికి వచ్చినట్లు తెలిపారు. గురువారం ఉదయం చెరువు వద్ద పని చేస్తుండగా ప్యానల్ బోర్డు వద్ద అనుమానాస్పద స్థితిలో హరీష్ చంద్ర పడి ఉండగా ఆచంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ పరీక్షించగా చనిపోయినట్లు చెప్పినట్లు తెలిపారు. స్నేహితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గురుకుల ఉపాధ్యాయుడికి ప్రశంస



విజయకిరణ్‌కు ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న రాహుల్

నరసాపురం రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఎల్‌బిచర్ల గురుకుల పాఠశాలలోని ఉపాధ్యాయుడు విజయ కిరణ్‌కు కేంద్ర మంత్రిత్వశాఖ కార్యదర్శి రాహుల్ నుంచి ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. హైదరాబాద్‌లో భారత సాంస్కృతిశాఖ ఆధ్వర్యంలో ఈనెల 9 నుంచి 29 వరకు కార్యక్రమం నిర్వహి ంచారు. ఇందులో పశ్చిమగోదావరి జిల్లా నుంచి విజయకిరణ్ చేతివృత్తుల కళాకారుల జీవన స్థితిగతుల అనే అంశంపై ప్రాజెక్టును సమర్పించారు. దీంతో ఆయనకు కేంద్ర కార్యదర్శి రాహుల్ నుంచి ప్రశంసపత్రాన్ని అందుకున్నారు. ఈసందర్భంగా గురువారం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్యాం ప్రసాద్, పి మార్క్, సిబ్బంది అభినందనలు తెలిపారు.

కుమ్ములాట

(5వ పేజీ తరువాయి)

అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. సమస్యలపై ప్రశ్నిస్తే కమిషనర్ కృష్ణమోహన్ ఏదేదో చెబుతారంటూ కౌన్సిలర్లు శ్యామల, మోపిదేవి సత్యవతి సమావేశం నుంచి వెళ్లిపోయారు.

సమస్యలు పట్టించుకోరే..?

పట్టణ సమస్యలపై పట్టించుకోవడం లేదని అధికార పక్షమైన వైసీపీ సభ్యులే సమావేశంలో ఆరోపించారు. ఇండ్ల స్థలాల లేఅవుట్ చేసుకొనే అంశం, శ్మశాన వాటికలు శుభ్రపరచాలని, పట్టణంలోని పలు సమస్యలు అభివృద్ధిపై దృష్టి సారించాలని అధికారులను కోరితే పట్టించుకోవడం లేదని వైసీపీ కౌన్సిలర్లు నిమ్మల నాగు, మోటుపల్లి కుమారి ఆవేదన వ్యక్తం చేశారు. జనసేన కౌన్సిలర్లు గోపిశెట్టి వెంకట సత్యవతి, గుర్రాని నాగలక్ష్మి, నేరెళ్ల ప్రసన్న తమ వార్డులలో సమస్యలు పరిష్కరించడంలేదన్నారు. వైసీపీ కౌన్సిలర్ల అంతర్గత కుమ్ములాటతో కౌన్సిల్ సమావేశంలో అజెండా సమస్యలు చర్చించకుండానే వెళ్లిపోయారు. చేసేదిలేక అధికారులు సమావేశం ముగించారు.

రుణాలు ఇవ్వండి

(5వ పేజీ తరువాయి)

కోట్లు వరకు మహిళలు రుణాలు పొందారు. వాటిని తీర్చడానికి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దాంతో కొత్త రుణాల కోసం అంతగా ఆసక్తి చూపడం లేదు. చిరువ్యాపారాలు, చేతివృత్తులు, ఇతర వ్యాపకాలు పెట్టుకున్న మహిళలు ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవడానికి అధిక మొత్తంలో రుణాలు తీసుకోవడానికి ముందుకొస్తున్నారు. లేదంటే తక్కువ మొత్తం రుణంతో సరిపెడుతున్నారు. ఫలితంగా ఈ ఏడాది గుర్తించిన మేరకు రూ.978 కోట్లు మాత్రమే అవసరం కానుందని అంచనా వేశారు. జిల్లాలో 27,910 క్రియాశీల గ్రూపులున్నాయి. అందులో 26,471 గ్రూపులకు రుణాలు అవసరమని గుర్తించారు. బ్యాంకులకు వివరాలు సమర్పిస్తున్నారు. కానీ రుణాలు మంజూరులోనే బ్యాంకులు జాప్యం చేస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి. జిల్లా కలెక్టర్ ఈ విషయమై బ్యాంకు అధికారులతో సమావేశమయ్యారు. రుణాలు ఇవ్వాల్సిందేనని ఆదేశించారు.




తుందుర్రులో తోట సీతారామలక్ష్మి.. తాడేపల్లిగూడెంలో వలవల బాబ్జి కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం.. ఉండిలో పర్యటిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

టీడీపీ నాయకుల ఇంటింటి ప్రచారం

భీమవరం రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అర్హులైన అందరికి కూటమి ప్రభుత్వం పథకాలను అందిస్తూ ప్రజలకు లబ్ధి చేకూరుస్తుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. గురువారం తుందుర్రు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ అందించబోతుందన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు కొయ్యలగడ్డ గణపతి, సీనియర్ నాయకులు కలిదిండి రామచంద్రరాజు, మండల ప్రధాన కార్యదర్శి కోళ్ళ సీతారాం మాట్లాడారు. అగ్ని క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నాగిడి తాతాజీ, క్లస్టర్ ఇన్‌చార్జి అల్లూరి సుబ్రహ్మణ్యరాజు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మైనార్టీ ప్రభుత్వ సలహాదారు ఏంఏ షరీఫ్ అన్నారు. గురువారం పట్టణంలోని 14వ వార్డులో టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, మత్స్యకార సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజులతో కలిసి సుపరిపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమం, అభివృద్ధిని వివరించారు.

రాష్ట్రాభివృద్ధి కూటమితోనే సాధ్యం

తాడేపల్లిగూడెం అర్బన్: రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, భవన, కార్మిక సంక్షేమ మండలి చైర్మన్ వలవల బాబ్జి అన్నారు. గురువారం పట్టణంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక మంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులతో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై మాట్లాడి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గొర్రెల శ్రీధర్, పట్నాల రాంపండు, రాంబాబు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులతో ముందుకు

ఉండి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఎక్కడ కూడా ప్రజలు ఆక్రమణల జోలికి వెళ్లవద్దని, అభివృద్ధి పనులు చేసుకుంటూ ముందుకు పోదామని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. గురువారం పెద్దవంతెన సెంటర్ నుంచి మసీదు వరకు నూతనంగా నిర్మించబోయే రింగ్‌రోడ్‌ను ఆయన పరిశీలించారు. చుట్టు పక్కల వున్న ఆక్రమణలను డ్రెయినేజీ అధికారులు తొలగించడంతో ఆ ప్రాంతాలను డిప్యూటీ స్పీకర్ పరిశీలించి తగు సూచనలు అందించారు. మసీదు నుంచి ఎన్‌హెచ్ రోడ్ దాటుకుని అట్టల ఫ్యాక్టరీ నుంచి అరుంధతీపేట మీదుగా రైల్వేస్టేషన్ వరకు ఈరోడ్ నిర్మాణం జరుగుతుందన్నారు. ఉండి సెంటర్ నుంచి కొత్తపేట మీదుగా చిక్కాలవీరన్న నగర్ వరకు ఈరోడ్ పనులను చేయనున్నట్లు తెలిపారు. ఉండి సెంటర్‌ను అభివృద్ధి చేయడానికి తాను ప్రణాళికతో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీ చైర్మన్ తోట ఫణిబాబు, వైస్ చైర్మన్ మంతెన సాయిలచ్చిరాజు పాల్గొన్నారు.

చినిమిల్లిపాడుకు బస్సు సౌకర్యం కల్పించాలి

ఆకివీడు రూరల్ జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆకివీడు మండలంలోని కొల్లేరు శివారు ప్రాంతం చినిమిల్లిపాడుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కళింగగూడెం టీడీపీ నాయకుడు పూజారి వరప్రసాద్ డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజుకు వినతి పత్రం అంద జేశారు. గతంలో భీమవరం నుంచి ఐదు ట్రిప్పులు ఆర్టీసీ బస్సు వచ్చేదని, ప్రస్తుతం ఆ సర్వీసు లేదని, ఆటోలకు అధిక రుసుము వసూలు చేస్తున్నారని తెలిపారు. కొల్లేరు శివారు ప్రాంతం కావడంతో ఆరు గ్రామాల ప్రజలు ఆర్టీసీ బస్సు సర్వీసుకోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించుకుందాం

భీమవరం క్రైం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని జిల్లా అడిషనల్ ఎస్పీ వి. భీమారావు అన్నారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో ప్లాస్టిక్ నిషేధ పోస్టర్‌ను ఆవిష్కరించారు. భీమారావు మాట్లాడుతూ ప్లాస్టిక్ ఉత్పత్తులపై నిషేధాన్ని కఠినంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందన్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగం విడనాడాలని పిలుపునిచ్చారు. నిషేధ కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి, టీవీవీ ప్రసాద్, సీఐ దేశంశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బాబా ఆలయంలో అన్న సమారాధన

మొగల్తూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి):మొగల్తూరు రామాలయం వీధిలో వేంచేసియున్న దత్తసాయి మందిరంలో గురువారం సందర్భంగా బాబా వారికి ప్రత్యేక పూజలు హారతులు నిర్వహించారు. గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు ఉండపల్లి ప్రభుదేవా మనుమరాలు ఉండపల్లి సాయి సహస్ర అన్నప్రాసన్న కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆలయంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని బాబా వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ నిర్వాహకులు శెట్టి మోహనరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పేకాట స్థావరంపై దాడి

మొగల్తూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): మొగల్తూరు ప్రధాన కూడలి సమీపంలో ఒక ప్రైవేట్ లాడ్జిలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై మొగల్తూరు పోలీసులు గురువారం దాడి చేశారు. ఈ దాడిలో రూ.16,700 నగదు స్వాధీనం చేసుకుని ఆరుగురు పేకాటరాయుళ్ళను అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ జి.వాసు తెలిపారు.

యూకేఎస్ వనిత క్లబ్ కార్యవర్గం ఎన్నిక

పాలకొల్లు అర్బన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : స్థానిక యునైటెడ్ కాపు వనితా సర్వీసెస్ క్లబ్ కార్యవర్గ ఎన్నిక గురువారం జరిగింది. లయన్స్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షురాలిగా డాక్టర్ కావలి మౌని ఎన్నిక కాగా, కార్యదర్శిగా కటిక అర్చన, కోశాధికారిగా తోట గాయత్రి, కార్యవర్గ సభ్యులుగా మరో 27 మంది ఎన్నికయ్యారు. నూతన సభ్యులచే మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాబ్జీ ప్రమాణం చేయించారు. డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మీ, డాక్టర్ ముచ్చర్ల సంజయ్, పోకల రాము, పెనుమాక రామమోహన్, విదుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శివయ్యను దర్శించుకున్న రాజా వన్నెంరెడ్డి

పాలకొల్లు, జూలై 31(ఆంధ్రజ్యోతి): క్షీరా రామలింగేశ్వర స్వామిని సినీ దర్శకుడు రాజా వన్నెంరెడ్డి గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజా వన్నెంరెడ్డి వెంట బుల్లితెర నటి సంజన, రచయిత, నటుడు వీరా పోతన ఉన్నారు. పాలకొల్లు పరిసర ప్రాంతాల్లో నిర్మిస్తున్న లఘుచిత్రం నాతిచరామి షూటింగ్ నిమిత్తం వచ్చిన దర్శకుడు వన్నెంరెడ్డి రాజా స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి శేష వస్త్రాలను ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు అందజేశారు.

స్మార్ట్ మీటర్లు వద్దంటూ ధర్నా

తణుకు, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించడం మానుకోవాలని నియోజకవర్గ కాంగ్రెసు ఇన్‌చార్జి దిర్శిపో రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం వేల్పూరు రోడ్డులో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అదానీతో ఒప్పందం రద్దు చేయాలని, సామాన్య ప్రజలపై భారాలు ఆపాలని డిమాండ్ చేశారు.

సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి


ఎమ్మెల్యే అంజిబాబును కలిసిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

భీమవరం టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసినప్పుడే సమాజ ప్రగతి సాధ్యమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం స్వచ్ఛంద సంస్థల సభ్యులు ఎమ్మెల్యే అంజిబాబును కలిసి మాట్లాడారు. స్వచ్ఛంద సంస్థలు సభ్యులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థలు ఎల్లప్పుడూ ముందుండి సహకారాలను అందిస్తాయని అన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు వబిలిశెట్టి రామకృష్ణ, యర్రంశెట్టి శివకృష్ణ, టివివి ప్రసాద్, చల్లా రాము పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చెయ్యాలి

భీమవరం టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 19,20 తేదీల్లో తణుకులో జరగనున్న 27వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు పిలుపునిచ్చారు. గురువారం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మ హాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ 19న తణుకు పట్టణంలో ప్రజాప్రదర్శన, బహిరంగ సభలకు అధిక సంఖ్యలో సీపీఐ, ప్రజా సంఘాల శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సభలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు.

వైద్య సిబ్బంది ఇళ్ల పరిసరాలు పరిశీలన

అత్తిలి, జూలై 31: గుమ్మంపాడు గ్రామంలో జాతీయ డెంగీ మాసోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె నాగరాజు, సబ్ యూనిట్ ఆఫీసర్ గుడిమెట్ల వెంకటేశ్వరరావు క్షేత్రస్థాయిలో గృహాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ గృహాల వద్ద ఉన్న రుబ్బురోళ్ళు నిరుపయోగ సామగ్రిలో దోమల లార్వా ఉన్నట్లు గుర్తించామన్నారు. లార్వా తొలగింపు చేయాలని కోరారు. ప్రజలు చేతుల శుభ్రత, ఆహార పదార్థాలు ఉన్న పాత్రలపై ఈగలు వాలకుండా విధిగా మూతలు ఉంచాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.

ధ్యానంపై 3న శిక్షణ

అత్తిలి, జూలై 31 (ఆంధ్రజ్యోతి: అత్తిలిలో దాసం వెంకట ప్రసాద్ (పెదతా తయ్య) ఇంటి వద్ద ధ్యానంపై శిక్షణ ఆదివారం ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు దాసం ప్రసాద్ తెలిపారు. రావులపాలెంకు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఉమ శిక్షణ ఇస్తారని తెలిపారు.

రోడ్డు నిర్మాణానికి కమిటీ ఏర్పాటు

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): మారంపల్లికి శాశ్వత రోడ్డు లేకపోవడంతో ఇటీవల నిర్వహించిన గ్రామసభలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ రోడ్డు నిర్మాణానికి హామీ ఇచ్చారు. దీనితో గ్రామస్థులంతా ఏకమై కొత్త మార్గం కోసం కలిసి ముందుకు వెళ్లేందుకు గ్రామ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు సరిపల్లె చిట్టిబాబు, మిద్దే కనకారావు, తోట సూర్యనారాయణ, సరిపల్లె వర్మ, కోళ్లపల్లి లక్ష్మిపతి తదితరులు కమిటీగా ఏర్పడ్డారు.

కొడమంచిలి పంచాయతీ రికార్డుల పరిశీలన

ఆచంట, జూలై 31(ఆంధ్రజ్యోతి): కొడమంచిలి పంచాయతీలో జరిగిన అవకతవకలపై డీఎల్‌పీవో జ్యోతిర్మయి విచారణ చేపట్టారు. 2021 నుంచి పంచాయతీలకు సంబంధించి జరిగిన వాటిపై పలువురి ఫిర్యాదు మేరకు అధికారులు విచారణ చేపట్టారు. దీనిలో భాగంగా డీఎల్‌పీవో గురువారం పంచాయతీకి వచ్చి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏవో వీఎన్ శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో బుల్లి సూరన్న పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి

కాళ్ళ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుమిషన్ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని మహిళలు ఉపాధి అవకాశాలు పొందాలని ఎంపీపీ పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు సూచించారు. కాళ్ళ గ్రామంలోని ఇంటిగ్రేటెడ్ బాలుర వసతి గృహం సముదాయంలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్, ఈడబ్ల్యుఎస్ సహకారంతో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను ఎంపీడీవో జి.స్వాతితో కలిసి గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు తమ సమస్యలను ఎంపీపీ దృష్టికి తీసుకెళ్ళగా వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు.

సాంకేతికతతో జీవనోపాధి మెరుగు

కాళ్ళ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సాంకేతికతను జోడించి గ్రామీణ ప్రజలు తమ జీవన స్థితిగతులు మెరుగుపరచుకోవాలని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు అన్నారు. కోపల్లె గ్రామంలో గురువారం 'సాంకేతికతను ఉపయోగించి గ్రామీణ ఉపాధి అవకాశాలు ఎలా మెరుగుపరచుకోవాలి' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్వా చెరువుల్లో చేప నుంచి నూనె తీయడం, చేపల మేత తయారు చేయడం వంటి వాటిని తమ కళాశాలలో ప్రత్యేక లేబొరేటరీస్ ద్వారా ఎంపిక కాబడిన ప్రతి ఒక్కరికి ఉచితంగా శిక్షణ అందిస్తామన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు

పాలకొల్లు అర్బన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): స్థానిక మంత్రి కార్యాలయంలో గురువారం నియోజకవర్గంలోని 82 మందికి వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ నుంచి వచ్చిన రూ.61 లక్షల రూపాయల చెక్కులను లబ్ధిదారులకు మంత్రి డాక్టర్ నిమ్మల అందించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మానవత్వంతో పనిచేస్తోందన్నారు. ఏడాది కాలంలో ఇప్పటి వరకు నియోజక వర్గంలోని 725 మందికి రూ. 5.42 కోట్ల రూపాయలు సిఎంఆర్ఎఫ్ నుంచి ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పెచ్చెట్టి బాబు, పట్టణ అధ్యక్షుడు జీవి, ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కర్, గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తణుకు, జూలై 31(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డివిజనల్ ఇంజనీర్ కె.నరసింహమూర్తి తెలిపారు. తణుకు పట్టణంలోని పలు ప్రాంతాలు, రూరల్ మండలంలోని గ్రామాలు, అత్తిలి, ఇరగవరం మండలంలోని గ్రామాలుకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆకివీడు రూరల్: శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ వెంకటేశ్వరరావు తెలిపారు. కోళ్ళపర్రు, రామాయగూడెం, గుమ్ములూరు, రాజులపేట, పెదకాపవరం, గంటలరాయుడుపేట, కవిటంపాకలు, అర్ధమూరు గ్రామాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పాలకొల్లు టౌన్: యడ్ల బజారు నుంచి పెద గోపురం, బ్యాంక్ స్ట్రీట్, రామచంద్రకాలనీ, పోస్టాఫీస్ ప్రాంతం తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె మధు కుమార్ తెలిపారు.

పెంటపాడు: పెంటపాడు, ముదునూరు, ఆకుతీగపాడు, కే.పెంటపాడు, పరిమెళ్ళ, యానాలపల్లి, పడమరవిప్పర్రు గ్రామాలలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ నర్సింహమూర్తి తెలిపారు.

విద్యుత్ బిల్లుల నగదు కాజేసిన లైన్‌మన్

ఉండి, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆక్వారైతుల నుంచి బిల్లులు వసూలు చేసి తాను చెల్లిస్తానని నమ్మబలికి ఆ డబ్బులు మొత్తం తన జేబులోకి వేసుకుని కాజేసిన దాసరి రాజు అనే లైన్‌మన్ ఉద్యోగి సంఘటన ఇది. ఈవిషయం విద్యుత్ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతోవారు గురువారం అర్ధమూరు వారు విచ్చేసి లైన్‌మన్‌పై విచారణ జరిపారు. ఆరుగురు రైతులు రూ.89,738 బిల్లులు కట్టాలని ఇచ్చారు. అయితే ఆ లైన్‌మన్ బిల్లులు చెల్లించలేదని తేలింది. ఇదిలా వుండగా అర్ధమూరుతో పాటు చెరుకువాడలో కూడా చేతివాటం చేసుకున్నట్లు చెబుతున్నారు. ఈరెండుచోట్లు అధికారులు బృందం పర్యటించి విచారణ చేశారు. సుమారుగా 9మంది ఏఈలు, మరో తొమ్మిది మంది అసిస్టెంట్ ఏఈలు ఈవిచారణ చేశారు.




ఉద్యోగ విరమణ చేసిన పోలీసులను సత్కరించిన ఎస్పీ నయీం అస్మి.. ఎంపీడీవో దంపతులను సత్కరించిన ఎమ్మెల్యే బొలిశెట్టి

ఉద్యోగ విరమణ సత్కారం

భీమవరం క్రైం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కర్తవ్య నిర్వహణలో చిత్తశుద్ధి, అంకిత భావంతో ప్రజలకు విశిష్ట సేవలందించి గురువారం పదవీ విరమణ చేసిన పోలీసు సిబ్బందిని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఘనంగా సత్కరించి జ్ఞాపికలు, అందించారు. ఎన్‌వీవీ నాగేశ్వరరావు, సబ్ ఇన్‌స్పెక్టర్, మహిళా పోలీసు స్టేషన్, భీమవరం, బి.పోలయ్య కాపు, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్, తణుకు టౌన్ పోలీస్ స్టేషన్, పీవీకే దుర్గారావు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్, తాడేపల్లిగూడెం రూరల్ పోలీస్ స్టేషన్ పదవీ విరమణ పొందారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ఎం.సత్యనారాయణ, భీమవరం సబ్ డివిజన్ డీఎస్పీ ఆర్.జయసూర్య పాల్గొన్నారు.

కాళ్ళ: పంచాయతీ కార్యదర్శిగా, ఈవోపీఆర్‌డీగా ఎంవీ భాస్కరరావు చేసిన సేవలు మరువలేనివని ఎంపీపీ పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు, ఎంపీడీవో జి.స్వాతి కొనియాడారు. గురువారం కాళ్ళ మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవో భాస్కరరావు పదవీ విరమణ సందర్భంగా వీడ్కోలు సభను నిర్వహించారు. భాస్కరరావు దంపతులను, ఏవోగా పని చేసి ప్రమోషన్‌పై పెనుమంట్ర ఎంపీడీవోగా వెళ్ళిన ఎంఎస్ ప్రభాకరరావులను ఘనంగా సత్కరించారు. మాజీ ఎంపీపీ ఆరేటి వెంకటరత్న ప్రసాద్, తహసీల్దార్ జి. సుందర్‌సింగ్, కార్యదర్శుల సంఘం


భాస్కరరావును సత్కరిస్తున్న ఎంపీపీ శిరీష, ఎంపీడీవో

నాయకులు టి.బాలకృష్ణ, డి. సునీల్‌రాజు, బి.సతీష్ కుమార్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: ఎంపీడీవోగా ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందించడంలో ఉత్తమ సేవలు చేసిన మల్లాది విశ్వనాథ్ సేవలు మరువలేనివని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కొనియాడారు. తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో పలు అంశాలను అధికారులతో చర్చించారు. అనంతరం ఉద్యోగ విరమణ చేస్తున్న ఎంపీడీవో దంపతులను సత్కరించారు. వలవల బాబ్జి, ఈతకోట తాతాజి పాల్గొన్నారు.